ANN తెలుగు

Follow: @ANNTELUGU

15-06-2026

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 159 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



# నేను కూడా రోడ్డుమీదకు వస్తా

- వర్షా ల సమయంలో రోడ్లపై ఉండాల్సిందే
- అప్రమత్తతతో ముప్పును.. ముంపును నివారించాలి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి


**హైదరాబాద్, మహా :** వర్షం సమయంలో ట్రాఫిక్ ఉన్నతాధికారుల నుంచి కింద స్థాయి సిబ్బంది వరకు రోడ్ల పైన ఉండాల్సిందేనని.. అవసరం అయితే తాను కూడా రోడ్డు మీదకు వస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించి విస్తారంగా వర్షాలు కురుస్తున్న వేళ వర్షాలు, వరద ముప్పు, ప్రకృతి విపత్తుల నిర్వహణపై ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సచివాలయంలో అత్యవసర ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల తీరుపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు.

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

## ఆడియో లోని వాయిస్ నాది కాదు

- మహేశ్ గౌడ్ నాకు తమ్ముడితో సమానం
- క్రమశిక్షణ కమిటీకి షబ్బీర్ అలీ వివరణ
- పార్టీని బలహీనపరిచేందుకు రాజకీయ కుట్రలు



02

## వైసీపీ ఫేస్ బుక్ పేజీ మాయం

- ప్రభుత్వంపై జగన్ సీరియస్
- పేజీని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్..



03

నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ"లో

## టీఎంసీ ఎంపీలు విలీనం

మమతా బెనర్జీకి కష్టాలు డబుల్



02




# అమరావతి అన్‌స్టాపబుల్

**నో బ్రేక్స్.. ఓన్లీ టాప్ గేర్**

**అసత్యాల మేఘాలు చీల్చుకుంటూ ప్రజా రాజధాని**

శరవేగంగా సాకారం అవుతున్న 'పీపుల్స్ క్యాపిటల్'

నవ సిటీ నయా హిస్టరీ.. జెట్ స్పీడ్ లో పనులు

సారీ బ్రో అంటూ.. లోకేష్ షాకింగ్ వీడియో

ఆరునెలల్లో సీఆర్ డీఏ.. ఏపీ అసెంబ్లీ రెడీ

**వచ్చే ఏడాది సెక్రటేరియట్, హైకోర్టు సహా ప్రధాన భవనాలు**





**(అమరావతి మహా):** నో బ్రేక్స్.. ఓన్లీ టాప్ గేర్ అంటూ అసత్యాల మేఘాలు చీల్చుకుంటూ ప్రజా రాజధాని అమరావతి నిర్మాణమవుతోంది. మట్టిని ముద్దాడిన సంకల్పం.. ఇప్పుడు ఆకాశాన్ని తాకే అద్భుతమైంది. ఆగిన చోటే మొదలైంది.. అణచిన శక్తులను చీల్చుకుంటూ ప్రజా రాజధాని గెలిచింది. తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక, ఐదు కోట్ల ప్రజల స్వప్నసౌధం అమరావతి ఇప్పుడు టాప్ గేర్ లో దూసుకుపోతోంది. నిన్నటి వరకు పాలకుల నిర్లక్ష్యంతో 'పాజ్' పడిన మహా నగరం.. నేడు చంద్రబాబు అచంచల విజన్, లోకేష్ ఆధునిక ముందుచూపుతో అన్‌స్టాపబుల్' గా రూపుదిద్దుకుంటోంది. కురుస్తున్న వానలను సైతం లెక్కచేయకుండా, రాత్రింబవళ్లు శ్రమిస్తున్న యంత్రాల ఘోషతో శరవేగంగా

మిగతా 2వ పేజీలో

# ఆగని అక్రమ దందా






## అమాయకులు నష్టపోతే కాని స్పందించరా..?

- ఊరికో పేరు.. వెంచర్‌కో మోసం
- శ్రీకారం ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సరికొత్త దందా!
- వాంగ్ధల్ లో 'ఆయుష్మాన్‌భవ'.. దవ్వూర్‌లో 'ఐకానిక్ హౌసింగ్ ఫార్మ్స్' పేరిట మోసం
- చెట్టు పేరు చెప్పి కాయలమ్ముతున్న రియల్టర్లు
- అమాయక శ్రమజీవులను దోపిడీ చేస్తున్న రియల్ కేటుగాళ్లు



అమాయక కొనుగోలుదారులను బురిడీ కొట్టించడమే ధ్యేయంగా సాగుతున్న అక్రమ రియల్ దందాలో రోజుకో పక్కా వ్యూహంతో అక్రమార్కులు చెలరేగి పోతున్నారు. "శ్రీకారం ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్", " శ్రీకారం ఇన్ ఫ్రా" అనుబంధ సంస్థలు సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గం పరిధిలో ఊరికో పేరుతో వెంచర్లు వేస్తూ ప్రజలను నిలువునా ముంచుతున్న తీరును ఏఎన్ఎన్, మహా పత్రిక, సంయుక్త పరిశోధనాత్మక ఆపరేషన్ బట్టబయలు చేసింది.సిర్గపూర్ మండలం వాంగ్ధల్ గ్రామంలో ఒక పేరు, మనూర్ మండలం దవ్వూర్ పరిధిలో మరో పేరుతో సమాంతరంగా ఈ అక్రమ సామ్రాజ్యాన్ని విస్తరించి వ్యాపార దందా కొనసాగిస్తోందని క్షేత్రస్థాయి ఆధారాలు నిరూపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా జిల్లా యంత్రాంగం రియల్ మాఫియా పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

02






## ఇందిరాపార్క్ వద్ద కాక్రోచ్ పార్టీ భారీ నిరసన

**ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు డిమాండ్**


**హైదరాబాద్ సిటీ, మహా :** హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ భారీ నిరసన ప్రదర్శన చేపట్టింది. పరీక్షా పత్రాల లీకేజీలు, విద్యావ్యవస్థలోని అవకతవకలపై ధర్నా నిర్వహించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. సీజేపీ నిరసనలో నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేశంలో నీట్ పేపర్ లీక్ ఆరోపణలు. పెరుగుతున్న

మిగతా 2వ పేజీలో

## చిన్నారి జ్ఞానేశ్వరి కోసం రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్

- పెంపుడు కుక్క మృతితో కొనసాగుతున్న మిస్టరీ
- 400 మంది సిబ్బంది, డ్రోన్లతో అటవీ ప్రాంతంలో గాలింపు


02





## విజయవాడ కేంద్రంగా.. డ్రగ్స్ నెట్ వర్క్

మాదాపూర్ లో పట్టుబడ్డ ముఠా



03

## మా మంత్రులు, ఎంపీలే అన్ని చేస్తే ఇక సీఎం ఎందుకు?

బిజెపి చీఫ్ రామచందర్ రావు



02



# అమరావతి అన్‌స్టాపబుల్

(మొదటి పేజీ తరువాయి)

ఆకాశహర్మ్యాలు తలయెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ అండతో, గ్లోబల్ బ్రాండ్ల నమ్మకంతో శతాబ్దపు అద్భుత నిర్మాణానికి పునాదులు పడుతున్నాయి. అసత్యపు ప్రచారాల మేఘాలను చీల్చుకుంటూ, ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ నగరంగా ఎదిగేందుకు అమరావతి సింహగర్జన చేస్తోంది. ఇది కేవలం కాంక్రీట్ కట్టడం కాదు.. నవ్యాంధ్ర భవిష్యత్తుకు తిరుగులేని అసలైన గ్యారంటీ. వచ్చే ఏడాది నుండి ఒక్కో భవనం అందుబాటులోకి వస్తుంటే.. నవ సిటీ వావ్ అనేలా కనిపించనుంది. ప్రభుత్వం నిర్దేశించుకున్న గడువుల ప్రకారం.. 2027 నాటికి అమరావతి ప్రాథమిక స్వరూపం పూర్తికానుంది.

అన్ స్టాపబుల్ విజన్ ఆంధ్రప్రదేశ్ ప్రజా రాజధాని, కలల నగరం అమరావతి మళ్లీ పూర్వవైభవాన్ని సంతరించుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అచంచల విశ్వాసం, ఐటీవిద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధునిక ముందుచూపు, కేంద్ర ప్రభుత్వ బలమైన సహకారంతో అమరావతి నిర్మాణం ఇప్పుడు "టాప్ గేర్" లో దూసుకుపోతోంది. గతంలో ఎదురైన అడ్డంకులను పటాపంచలు చేస్తూ.. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రాత్రింబగళ్లు జరుగుతున్న నిర్మాణ పనులతో అమరావతి ఇప్పుడు 'అన్‌స్టాపబుల్' గా మారింది.

**క్యూ కట్టిన ప్రైవేట్ సంస్థలు.. ప్రముఖ గ్లోబల్ బ్రాండ్లు**

అమరావతిని కేవలం ప్రభుత్వ నగరంగానే కాకుండా, ఆర్థిక, విద్యా హబ్‌గా మార్చేందుకు దేశ విదేశీ సంస్థలు క్యూ కడుతున్నాయి.

**- విద్యారంగంలో గ్లోబల్ హబ్ నాలెడ్జ్ సిటీ**

అమరావతి ఇప్పటికే విద్యా హబ్‌గా రూపుదిద్దుకుంది. ఇక్కడ వేలాది మంది విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి విద్యను అభ్యసిస్తున్నారు.

ఎస్ ఆర్ ఎం యూనివర్సిటీ ఏపీ , విఐటీఏపీ: ఇప్పటికే పూర్తి స్థాయిలో క్యాంపస్‌లు నడుస్తూ, విస్తరణ పనులు జరుపుకుంటున్నాయి.

అమృత విశ్వ విద్యాపీఠం జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న సంస్థ కాగా క్యాంపస్ పనులు తుది దశకు చేరుకున్నాయి.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ : డిజైన్ రంగంలో దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన ఈ సంస్థ కార్యకలాపాలు వేగవంతమయ్యాయి.

**బ్యాంకింగ్ , ఫైనాన్షియల్ సంస్థలు (ఫైనాన్షియల్ సిటీ)**

రాజధానికి ఆర్థిక ప్రేరణ ఇచ్చేందుకు దేశీయ దిగ్గజాలు ఇక్కడ ల్యాండ్ మార్క్ భవనాలను నిర్మించబోతున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతిలో ప్రాంతీయ కార్యాలయ స్థాపనకు స్థల పరిశీలన, ప్రాథమిక అనుమతులు పూర్తయ్యాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెగా అడ్మినిస్ట్రేటివ్ హబ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. హడ్కో రాజధాని మౌలిక వసతుల నిధుల సమీకరణలో భాగస్వామిగా ఉంటూ, తన సొంత ప్రాంతీయ కార్యాలయాన్ని ఇక్కడ నిర్మించనుంది.

**వరల్డ్ క్లాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్: అమరావతి ప్రత్యేకత**

భూగర్భంలోనే డ్రైనేజీ, విద్యుత్, గ్యాస్ లైన్లు ఉండేలా సరికొత్త "ట్రంచ్ విధానం" తో మౌలిక వసతులు రూపుదిద్దుకుంటున్నాయి. రహదారుల నెట్ వర్క్: 6లేన్ మరియు 8లేన్ ఎక్స్‌ప్రెస్‌వేలు. వరద నియంత్రణ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అమరావతి మునిగిపోతుందంటూ ట్రోల్ చేసిన వారికి సమాధానంగా, అద్భుతమైన స్టామ్ వాటర్ డ్రైనేజీ డిజైన్‌తో వర్షంలోనూ పనులు సాగాయి. వరద ముప్పు లేని నగరంగా నెదర్లాండ్స్ సాంకేతికతతో రిజర్వాయర్లు, కెనాల్స్ నిర్మిస్తున్నారు. కృష్ణా నది తీరాన్ని దుబాయ్, సింగపూర్ తరహాలో పర్యాటక, వినోద కేంద్రంగా మార్చే అమరావతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ రీడిజైన్ అవుతోంది.

**చంద్రబాబు విజన్ – లోకేష్ వ్యూహం – కేంద్రం అండ**

"అమరావతి ఒక నగరం కాదు.. అది ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీక. ఇది కేవలం పరిపాలనా రాజధాని కాదు.. సంపద సృష్టించే పీపుల్స్ క్యాపిటల్. అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తరచూ అంటుంటారు. చంద్రబాబు నాయుడి పట్టుదలతో గతంలో ఎక్కడైతే పనులు ఆగిపోయాయో, అక్కడి నుంచే మరింత ఆధునిక సాంకేతికతతో బాబు అమరావతిని పరుగులు పెట్టిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ టాప్5 నగరాలలో ఒకటిగా అమరావతిని నిలపాలన్నదే ఆయన ఏకైక లక్ష్యం.

**లోకేష్ యాక్షన్ ప్లాన్:** ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువతకు ఉపాధి కల్పించేలా "గ్లోబల్ బిజినెస్ డిస్ట్రిక్ట్", "ఐటీ కారిడార్" లపై ప్రత్యేక దృష్టి



పెట్టారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసే ట్రోలర్లకు గట్టి కౌంటర్ ఇస్తూ, వానలోనూ జరుగుతున్న పనుల వీడియోలను షేర్ చేసి, పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని నింపారు. "ఇకపై అమరావతిలో పాజ్ లేదు.. కేవలం ప్లే మాత్రమే" అని ఆయన స్పష్టం చేశారు.

కేంద్ర ప్రభుత్వ బహుమతి: ప్రపంచ బ్యాంక్ మరియు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ల ద్వారా కేంద్ర ప్రభుత్వం అమరావతికి అందిస్తున్న రూ.15,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయం నిర్మాణ సంస్థలకు కొండంత అండగా నిలిచింది. దీంతో ఎల్ అండ్ టీ , షాపూర్జీ పల్లోంజీ వంటి దిగ్గజ నిర్మాణ సంస్థలు పూర్తి నమ్మకంతో పనులను పరుగులు పెట్టిస్తున్నాయి.



## ప్రస్తుతం పురోగతిలో ఉన్న ప్రధాన ప్రభుత్వ ప్రాజెక్టులు – గడువులు

అమరావతిని కేవలం కాంక్రీట్ జంగిల్‌గా కాకుండా, ప్రపంచ స్థాయి పరిపాలనా నగరంగా తీర్చిదిద్దేందుకు అడ్మినిస్ట్రేటివ్ కోర్ ఏరియాలో పనులు శరవేగంగా సాగుతున్నాయి.

**1. ఆంధ్రప్రదేశ్ శాసనసభ :** ప్రస్తుత స్థితి : ఆధునిక సాంకేతికత, ఐకానిక్ డిజైన్‌తో పునాదుల దశ దాటి పనులు వేగంగా సాగుతున్నాయి.
**అంచనా పూర్తి కాలం :** 2026 చివరి నాటికి లేదా 2027 ప్రథమార్ధం లోపు.

**2. ఏపీ సెక్రటేరియట్ & జీఏడీ టవర్స్:** ప్రస్తుత స్థితి : 49 అంతస్తులతో ప్రతిపాదించిన ఐకానిక్ ట్విన్ టవర్స్ పనులు పునఃప్రారంభమయ్యాయి. నిర్మాణ సంస్థలు రేయింబవళ్లు శ్రమిస్తున్నాయి.
అంచనా పూర్తి కాలం : 2027 నాటికి దశలవారీగా.

**3. ఏపీ హైకోర్టు :** ప్రస్తుత స్థితి : ఇప్పటికే తాత్కాలిక భవనంలో నడుస్తుండగా, శాశ్వత జస్టిస్ సిటీ కాంప్లెక్స్ మరియు అనుబంధ న్యాయ మౌలిక సదుపాయాల విస్తరణ పనులు వేగవంతమయ్యాయి.
అంచనా పూర్తి కాలం : 2027 మధ్య నాటికి.

**4. సీఆర్ డీఏ ప్రధాన కార్యాలయం:** ప్రస్తుత స్థితి : ప్రీఇంజనీర్డ్ బిల్డింగ్ సాంకేతికతతో వేగంగా రూపుదిద్దుకుంటోంది.
అంచనా పూర్తి కాలం : రాబోయే 6 నుండి 8 నెలల్లో.

**5. సీడ్ యాక్సెస్ రోడ్డు :** ప్రస్తుత స్థితి : రాజధానికి వెన్నెముక లాంటి ఈ 6లేన్ ప్రధాన కనెక్టివిటీ రహదారి పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. లింక్ రోడ్ల విస్తరణ జరుగుతోంది.
అంచనా పూర్తి కాలం : 2026 చివరి నాటికి

### భవిష్యత్తు రూపం: నైన్ సిటీస్

రాబోయే 3 నుండి 5 ఏళ్లలో అమరావతి 9 ప్రత్యేక నగరాల కలయికగా అవతరించబోతోంది
గవర్నమెంట్ సిటీ (పరిపాలన)
జస్టిస్ సిటీ (న్యాయ వ్యవస్థ)
ఫైనాన్షియల్ సిటీ (ఆర్థికం)
నాలెడ్జ్ సిటీ (విద్య)
హెల్త్ సిటీ (వైద్యం)
స్పోర్ట్స్ సిటీ (క్రీడలు)
టూరిజం సిటీ (పర్యాటకం)
మీడియా సిటీ (సినీ, వినోదం)
ఎలక్ట్రానిక్స్ & ఐటీ సిటీ (సాంకేతికత)



# ఆగని అక్రమ దందా

**స్పెషల్ టాస్క్ ఫోర్స్**

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ రెవెన్యూ డివిజన్ సిర్గాపూర్, మనూర్ మండల కేంద్రాలను అడ్డాగా చేసుకుని ఒకే యాజమాన్యం రెండు ఊర్లు రెండు విభిన్న మాయ వెంచర్ల (ఆయుష్మాన్ భవ" 'ఐకానిక్ హౌసింగ్ ఫార్మ్స్') పేర్లతో ప్రజలను గందరగోళానికి గురి చేస్తుంది. అంతే కాకుండా నిర్వాహకులు ప్రజలను గందరగోళానికి గురిచేసి, లీగల్ చిక్కులను తప్పించుకోవడాని వేరు వేరు బ్రాండ్ల పేరుతో మోసాలకు పాల్పడుతున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. వాంగ్దల్ లో "ఆయుష్మాన్‌భవ" పేరుతో సర్వే నెంబర్ 27 లో 100 ఎకరాల భారీ ప్రాజెక్టు అంటూ భారీ ఎత్తున ప్రచారం ప్రారంభించింది. 49 ఎకరాల్లో 310 ప్లాట్లు వేసి , 121 గజాల చొప్పున విభజించి ప్లాటు కేవలం రూ. 1,60,000 కే అంటూ మధ్యతరగతి వారిని ఈ రియల్ మాఫియా ఆకర్షిస్తుంది .ఐకానిక్ హౌసింగ్ ఫార్మ్స్ పేరుతో ఇదే ముఠా పక్కనే ఉన్న దవ్వూర్ గ్రామ సర్వే నెంబర్ 92లో తగు భూమి లేనప్పటికీ ప్రభుత్వ



నిబంధనల ప్రకారం డీటీసీపీ లేదా స్థానిక పంచాయతీల నుంచి ఎలాంటి కనీస అనుమతులు లేకుండానే అడ్డగోలుగా వెంచర్ వేసి 100 ప్లాట్లను బ్రోచెర్లలో ముద్రించి, కళ్లు చెదిరే ఆఫర్లు, బంపర్ గిఫ్టులు, అంత కుమించి పండ్ల తోటల ఆదాయం అంటూ సరికొత్త హంగులతో కస్టమర్లను బురిడీ కొట్టిస్తుంది.







**అమాయక ఆటో డ్రైవర్లు, కూరగాయల వ్యాపారులే వీరి టార్గెట్**

ఈ సంస్థలు ధనిక వర్గాలను కాకుండా, రెక్కాడితే గానీ డొక్కాడని శ్రమజీవులను టార్గెట్ చేయడం అత్యంత బాధాకరం అయినప్పటికీ, హైదరాబాద్ నగరం నలుమూలల నుండి ఆటో డ్రైవర్లు, కూరగాయలు అమ్ముకునే చిన్న చిన్న వ్యాపారులు, మధ్యతరగతి జీవులను ఆకర్షణీయమైన మాటలతో నారాయణ్‌ఖేడ్ వెంచర్లకు తీసుకు వస్తున్నారు.కష్టపడి దాచుకున్న కొద్దిపాటి సొమ్మును ప్లాట్ల రూపంలో పెడితే భవిష్యత్తులో పిల్లల పెళ్ళిళ్లకో, ఇతర అత్యవసరాలకో అమ్ముకోవచ్చనే ఆశతో వారు ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోతున్నారు .కానీ తీరా అవసరం వచ్చి ప్లాట్ అమ్ముకుందాం అని క్షేత్రస్థాయికి వెళ్తే, అక్కడ కనీసం ప్లాట్ వేసిన దాఖలాలు గాని సరిహద్దులు కనిపించని పరిస్థితులు నెలకొందని బాధితులు వాపోతున్నారు. స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు అండదండలు అందించడంతో రియల్టర్ల ఆగడాలకు హద్దే లేకుండా పోతుందని స్థానికులతో పాటు బాధితులు ఆరోపిస్తున్నారు. జిల్లా పంచాయతి అధికారి గడప దాటక పోవడం, డి ఎల్ పి ఓ ఈ అక్రమ వెంచర్లపై కన్నెత్తి చూడక పోవడం, గ్రామ పంచాయతీ కార్యదర్శికి బారి మొత్తంలో ముడుపులు ముట్ట చెప్పడంతో అక్రమ వెంచర్లని తన బుజ స్కంధాలపైన వేసుకుని కాపాడుతున్నట్లు స్థానికంగా ఏ ముగ్గురు కలిసిన ఇదే ప్రధాన చర్చగా కొనసాగడం విశేషం. bఈ అక్రమ వెంచర్లపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి రియల్ మాఫియా పై ఉక్కుపాదం మోపేందుకు జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ ని ఏర్పాటు చేయాలనీ బాధితులు వేడుకుంటున్నారు.

## 'రియల్' దందా ముసుగులో .. గంజాయి, మారణాయుధాల స్మగ్లింగ్ ముప్పు!

ఆదివారం వస్తే చాలు నారాయణ్‌ఖేడ్ సరిహద్దుల వైపు వందలాది వాహనాల రద్దీతో కస్టమర్ల ముసుగులో అంతర్రాష్ట్ర ముఠాల చొరబడుతున్నట్లు విశ్వసనీయమైన వర్గాల సమాచారం మేరకు తెలుస్తుంది. ఆరు సరిహద్దు మండలాల్లో హై అలర్ట్.. ప్రత్యేక చెక్‌పోస్టులు పెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నారాయణ్‌ఖేడ్, రెవిన్యూ డివిజన్ లో జరుగుతున్న రియల్ మాఫియా పై మహా పత్రిక క్షేత్ర స్థాయి పరిశీలనలోజరిపిన పరిశీలనలో విస్తుగొలిపే అంశాలు బహిర్గతం అవుతున్నాయి. నిన్నమొన్నటి వరకు ప్రశాంతతకు నిలయంగా ఉన్న సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గ సరిహద్దు ప్రాంతాలు ఇప్పుడు అంతర్రాష్ట్ర నేరగాళ్లకు, స్మగ్లర్లకు కేర్ అఫ్ అడ్రెస్స్ గామారుతున్నాయా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. వారాంతాల్లో ఇక్కడ సాగుతున్న అసాధారణ వాహనాల రద్దీ వెనుక పెను ప్రమాదం పొంచి ఉందా? అంటే అవుననే అంటున్నాయి క్షేత్ర స్థాయి పరిస్థితులు. ప్రతి ఆదివారం వందలాది కార్లు, ప్రైవేటు వాహనాలు హైదరాబాద్, ఇతర రాష్ట్రాల నుండి కస్టమర్ల ముసుగులో వారి కార్యాకలాపాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని పేరు బయటికి చెప్పని కొందరు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ రద్దీని ఆసరాగా చేసుకుని పక్కనే ఉన్న కర్ణాటక సరిహద్దుల గుండా గంజాయి, నకిలీ నోట్లు, చివరకు నిషేధిత మారణాయుధాల స్మగ్లింగ్ కూడా సాగే ప్రమాదం ఉందని, ముఖ్యంగా నాగల్‌గిద్ద, మనూరు, నారాయణ్‌ఖేడ్, సిర్గపూర్ కల్హేర్, కంగ్టి ఆరు మండలాల పోలీస్ స్టేషన్ల పరిధిలో భద్రతను కట్టుదిట్టం చేసి, ఇంటెలిజెన్స్ వర్గాలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతయినా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. కర్ణాటక సరిహద్దుల నుండి నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గంలోకి ప్రవేశించే అన్ని ప్రధాన, అంతర్గత రహదారులపై ఆదివారం ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని వచ్చే పోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని పోలీస్ ఉన్నతాదికారులకు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆడియోలోని వాయిస్ నాది కాదు

**హైదరాబాద్, మహా :** ఆ ఆడియో క్లిప్ నకిలీదని, అందులో ఉంది తన వాయిస్ కాదని వైరల్ అవుతున్న ఆడియోపై పార్టీ క్రమశిక్షణ కమిటీ పంపిన లేఖకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వివరణ ఇచ్చారు. తనపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని.. క్రమశిక్షణ కమిటీ వివరణ కోరక ముందే ఆడియోపై పోలీసులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. కొందరు కావాలనే తనపై అవాస్తవాలు ప్రచారం చేస్తూ, తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. తాను ఎక్కడా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ గురించి తప్పుడు వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. మహేశ్ కుమార్ గౌడ్ తనకు 4 దశాబ్దాలుగా తెలుసునని.. అతను తన సోదరుడిలాంటి వాడని వ్యాఖ్యానించారు. మహేశ్ కుమార్ గౌడ్, తనకు మధ్య దూరం పెంచేందుకు కుట్ర చేశారని ఆరోపించారు. 45 ఏళ్లుగా కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నానని, పార్టీకి నష్టం చేకూర్చే పని ప్రాణం పోయినా చేయనని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలహీనపరచాలనే ఉద్దేశంతో కొందరు ఈ తరహా రాజకీయ కుట్రలకు తెరలేపారన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను పార్టీ శ్రేణులు నమ్మవద్దని, కుట్రదారుల వెనుక ఉన్న అసలు సూత్రధారులను త్వరలోనే బయటపెడతామని చెప్పుకొచ్చారు.

# నేను కూడా రోడ్డుమీదకు వస్తా



(మొదటి పేజీ తరువాయి)

జూన్ 1 న రివ్యూ పెట్టి వర్షాల పైన ముందస్తు సూచనలు ఇచ్చిన కూడా జూన్ 9 న వర్షం సమయంలో అధికారులు సరిగా పని చేయలేదని చెప్పారు. వర్షం సమయంలో క్యూర్ ఏరియాలో మునిసిపల్, పోలీస్ అధికారుల మధ్య సమన్వయం లేదని మండిపడ్డారు. వర్షం పడే సమయంలో ఫీల్డ్ లో ఉండని అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వాటర్ లాగింగ్ పాయింట్ , బ్లాక్ స్పాట్లు, ట్రాఫిక్ జామ్ ఏర్పడే ప్రాంతాల డేటా ఆధారంగా వర్షాల సమయంలో పని చేయాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. విద్యుత్‌శాఖ పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఉండని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. వర్షం సమయంలో ట్రాఫిక్ ఉన్నతాధికారులు నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనన్నారు. అవసరం అయితే తాను కూడా వచ్చి పరిశీలిస్తానన్నారు. వర్షం వల్ల ట్రాఫిక్ జామ్ అయితే బాధ్యులపై చర్యలు తప్పవని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మానవ తప్పదాల వల్ల సమస్య వస్తే సహించేది లేదన్నారు. ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్‌లో తక్షణమే ఖాళీల భర్తీ చేయాలన్నారు.

**ప్రాజెక్టుల వద్ద అలర్ట్ గా ఉండండి**

వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టుల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్వహణ మాన్యువల్ ప్రకారం జరగాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల సీఈలు, ఎస్‌సీలు సీజన్‌లో స్థానికంగా ఉండాలని ఆయన ఆదేశించారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఇంజినీర్లు ప్రాజెక్టులను వదిలివస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాజెక్టుల నిర్వహణ, గేట్ల మరమ్మతులకు తక్షణమే నిధులు విడుదల చేస్తున్నట్లుగా వెల్లడించారు. ఇరిగేషన్ మెట్రో వాటర్ బోర్డు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.


# ఇందిరాపార్క్ వద్ద కాక్రోచ్ పార్టీ భారీ నిరసన

**ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు డిమాండ్**



**హైదరాబాద్ సిటీ, మహా :** హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ భారీ నిరసన ప్రదర్శన చేపట్టింది. పరీక్షా పత్రాల లీకేజీలు, ్ విద్యావ్యవస్థలోని అవకతవకలపై ధర్నా నిర్వహించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. సీజేపీ నిరసనలో నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేశంలో నీట్ పేపర్ లీక్ ఆరోపణలు. పెరుగుతున్న నిరుద్యోగ సంక్షోభానికి నిరసనగా ధర్నా చేపట్టారు. పోటీ పరీక్షలలో పారదర్శకతను పాటించడంలో ప్రభుత్వం విఫలమైందని యువత ఆరోపించారు. విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలన్నారు. పదేపదే జరుగుతున్న పరీక్షా అవకతవకలు జరుగుతున్నాయని.. పేపర్ లీక్‌లు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీశాయని నిరసన గళం వినిపించారు. దేశవ్యాప్తంగా విద్యావంతులైన యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా పోతున్నాయని మండిపడ్డారు. పరీక్షాను నిర్వహించడంలో విఫలమైనందుకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను జవాబుదారీగా చేస్తూ, ఆయన తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్, ఆకునూరి మురళితో పాటు పలువురు పాల్గొన్నారు. ఆన్ లైన్ ఉద్యమం.. స్ట్రీట్ ఫైట్ గా మారాలన్నారు.






## నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ"లో టీఎంసీ ఎంపీలు విలీనం

**మమతా బెనర్జీకి కష్టాలు డబుల్**

**ఢిల్లీ, మహా :** పశ్చిమ బెంగాల్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. మాజీ సీఎం, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి వరస ఎదురుదెబ్బలు తాకుతున్నాయి. ఆ పార్టీకి లోక్‌సభలో 28 మంది ఎంపీలు ఉంటే, 20 మందికి పైగా ఎంపీలు తిరుగుబాటు చేశారు. వీరంతా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు. మరోవైపు, మమత ఇండియా కూటమిలో ఉన్నప్పుడు, ఎంపీలు మాత్రం ఎన్డీయే కూటమిలో భాగస్వామ్యం కాబోతున్నారు. "మేము 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ'లో చేరాము. ఇది గుర్తింపు పొందిన ప్రాంతీయ పార్టీ. మేము అందులో విలీనమయ్యాము. అసలైన టీఎంసీ ఏది అనేది కోర్టు నిర్ణయిస్తుంది," అని టీఎంసీ రెబల్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ అన్నారు. కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో సమావేశం తర్వాత ఢిల్లీలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాలో రెబల్ వర్గం సమావేశమైన కొన్ని గంటల తర్వాత ఈ రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. టీఎంసీలోనే ప్రత్యేక వర్గంగా ఉండటం వల్ల న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయనే రెబల్ వర్గం విలీనం ఆలోచనతో ప్లాన్ చేసింది.

## చిన్నారి జ్ఞానేశ్వరి కోసం రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్

**కాకినాడ, మహా :** కాకినాడ జిల్లాలో అదృశ్యమైన రెండేళ్ల చిన్నారి సుంకర జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు మరింత ముమ్మరమయ్యాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) బృందాలు కూడా రంగంలోకి దిగాయి. ఇప్పటికే ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, అటవీ, రెవెన్యూ, అగ్నిమాపక శాఖలకు చెందిన 400 మంది సిబ్బంది గాలింపులో పాల్గొంటున్నారు. తుని మండలం సిహెచ్ అగ్రహారం లోని పామాయిల్ తోటలో జూన్ 6న చిన్నారి జ్ఞానేశ్వరి తప్పిపోయింది. తోటలో పనిచేసే తల్లిదండ్రులు గణేశ్, భవానీ మధ్య సమన్వయ లోపం కారణంగా పాప అదృశ్యమైంది. ఆ రోజు సాయంత్రం ఒక గ్రామస్థుడు పాపను, దాని పెంపుడు కుక్కను కొండ సమీపంలో చూశాడు. పాపను తీసుకురావడానికి ప్రయత్నించగా, కుక్క అడ్డుకుంది. ఈ కేసులో కీలకమైన పెంపుడు కుక్క శనివారం మృతి చెందడంతో మిస్టరీ మరింత జటిలంగా మారింది. జూన్ 9న ఒంటరిగా ఇంటికి తిరిగి వచ్చిన ఈ కుక్కకు, పోలీసులు జూన్ 12న జీపీఎస్ ట్రాకర్ అమర్చి పాప ఆచూకీ కనుగొనే ప్రయత్నం చేశారు. అయితే, ఆ కుక్క అనూహ్యంగా ప్రవర్తిస్తూ, ఆహారం తీసుకోకుండా దాదాపు 80




గంటల పాటు, 8 కిలోమీటర్లు తిరిగి ఇంటికి వచ్చాక మరణించింది. కుక్క మృతికి కారణం తెలుసుకునేందుకు అధికారులు పోస్టుమార్టంకు పంపించారు. ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నారు. చిన్నారి ఆచూకీ తెలిపిన వారికి జిల్లా యంత్రాంగం లక్ష రూపాయల రివార్డు ప్రకటించింది. అత్యాధునిక డ్రోన్లు, 38 సీసీటీవీ కెమెరాల ఫుటేజీని విశ్లేషిస్తూ గాలింపు కొనసాగిస్తున్నామని కాకినాడ ఎస్పీ జి.బిందు మాధవ్ తెలిపారు.

## మా మంత్రులు, ఎంపీలే అన్ని చేస్తే ఇక సీఎం ఎందుకు?

**బిజెపి చీఫ్ రామచందర్ రావు**

**హైదరాబాద్, మహా :** రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆ క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకుని ప్రచారం చేసుకుంటోందని బిజెపి స్టేట్ చీఫ్ రామచందర్ రావు విమర్శించారు. ధాన్యం కొనుగోలు చేయాలని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను సీఎం రేవంత్ రెడ్డి కోరుతున్నారని.. అన్ని పనులు కేంద్ర మంత్రులు, ఎంపీలు చేస్తే ముఖ్యమంత్రి పదవిలో మీరు ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఒక్కరోజు వర్షం పడితేనే నగరం అతలాకుతలమైందన్నారు. ఈ పరిస్థితికి మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని, వెంటనే ఆ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు.



# మాట నిలుపుకున్న విజయ్ దేవరకొండ

**రష్మికతో కలిసి విద్యార్థులకు స్కాలర్ షిప్ లు**

**అచ్చంపేట, మహా :** టాలీవుడ్ క్రేజీ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తమ ఉదారతతో రియల్ లైఫ్ హీరోలుగా నిలిచారు. పెళ్లి పీటలపై తాము ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ.. నాగర్ కర్నూలు జిల్లా, అచ్చంపేట డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 'ది దేవరకొండ ఫౌండేషన్' తరపున మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేశారు. బల్మూరు మండలంలోని తుమ్మన్‌పేట గ్రామానికి విజయ్ దేవరకొండ కుటుంబంతో విడదీయరాని బంధం ఉంది. అది విజయ్ తండ్రి గోవర్ధన్ స్వగ్రామం. రష్మికతో వివాహం అనంతరం ఈ గ్రామానికి సతీసమేతంగా విచ్చేసిన విజయ్.. అక్కడే తన వెడ్డింగ్ రిసెప్షన్ కూడా జరుపుకున్నారు. ఆ రోజే అచ్చంపేట డివిజన్‌లోని 45 ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10 తరగతులు చదివే పేద మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఇస్తానని ప్రామిస్ చేశారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైన వేళ.. ఆ నియోజకవర్గంలో 1, 2 ర్యాంకులు సాధించిన 180 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆదివారం స్కాలర్‌షిప్‌లు అందించి తన మాట నిలబెట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి విజయ్ దేవరకొండ ఎంతో ఎమోషనల్‌గా మాట్లాడారు. "మీరు సాధించిన విజయాన్ని సెలబ్రేట్ చేయడానికే మేమంతా ఇక్కడికి వచ్చాం. మార్కులు ఎక్కువ రావడం కంటే.. దానికోసం మీరు పడిన శ్రమ, చూపిన ఏకాగ్రత చాలా గొప్పవి. నేను, రష్మిక మా స్టూడెంట్ లైఫ్‌లో ఎప్పుడూ టాపర్స్ కాదు. నాగర్ కర్నూలు జిల్లా తెలంగాణలోనే టెన్త్ రిజల్ట్స్‌లో సెకండ్ ప్లేస్ సాధించిందని డీఈఓ గారు చెప్పడం చాలా గర్వంగా ఉంది. ఈ క్రెడిట్ అంతా ఇక్కడి టీచర్లదే. మా నాన్న, అమ్మ ఈ ఊరితో పెంచుకున్న అనుబంధం వల్లే నేడు నేను ఈ ఛారిటీ చేయగలుగుతున్నాను. మీ అందరి జీవితాల్లో నేను ఒక భాగం కావాలనే ఈ ప్రయత్నం. ఇప్పుడు అచ్చంపేటలో స్టార్ట్ చేశాం.. నెక్స్ట్ నాగర్ కర్నూలు జిల్లా మొత్తం, ఆ తర్వాత తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల పేద మెరిట్ విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్స్ అందించడమే మా ఫౌండేషన్ కల. వచ్చే ఏడాది కూడా 'విజయ్ అన్న వస్తాడు, స్కాలర్‌షిప్ ఇస్తాడు' అనే ఉత్సాహం పిల్లల్లో కలగాలి. ఈ సాయం నిజమైన అర్హులకు మాత్రమే అందేలా చూడాలని అధికారులను కోరుతున్నాను. విద్యార్థులందరికీ నా ఆల్ ది బెస్ట్" అని అన్నారు. ఈ వేడుకలో విజయ్, రష్మికలతో పాటు విజయ్ మాతృమూర్తి మాధవి, తండ్రి గోవర్ధన్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, జిల్లా విద్యాధికారి రమేష్, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విజయవాడ కేంద్రంగా.. డ్రగ్స్ నెట్ వర్క్

# మాదాపూర్‌లో పట్టుబడ్డ ముఠా



**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలోని మాదాపూర్‌లో సాగుతున్న ఒక వీకెండ్ డ్రగ్స్ పార్టీని మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అత్యంత చాకచక్యంగా దాడి చేసి భగ్నం చేశారు. మాదాపూర్ పరిధిలోని చంద్రనాయక్ తండాలో గల 'ఎంబీఎస్ భాగ్యలక్ష్మి అపార్ట్‌మెంట్స్' లోని ఒక ఫ్లాట్‌లో కొందరు యువకులు డ్రగ్స్ పార్టీ చేసుకుంటున్నారనే నమ్మకమైన సమాచారంతో పోలీసులు శనివారం అర్ధరాత్రి ఈ దాడులు నిర్వహించారు. వీకెండ్ కావడంతో ఈ డ్రగ్స్ పార్టీ కోసం ప్రత్యేకంగా విజయవాడ నుండి కొందరు యువకులు హైదరాబాద్ వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడిలో పార్టీ ఆర్గనైజర్ అయిన దనేకుల తరుణ్ తేజతో పాటు మొత్తం తొమ్మిది మంది యువకులను పోలీసులు అక్కడికక్కడే పట్టుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో విజయవాడకు చెందిన కార్తీక్, పృథ్వి అనే వ్యక్తులు ఈ డ్రగ్స్ నెట్‌వర్క్‌ను నడుపుతున్నట్లు తేలింది. వీరిద్దరూ దనేకుల తరుణ్ తేజ ద్వారా హైదరాబాద్‌లో యువతకు డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ దాడిలో నిందితుల నుండి ₹ లక్షల విలువైన 15 గ్రాముల ఎండీఎంఏ, 382 గ్రాముల ఓజీ కుష్ గంజాయి, 9 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ప్రధాన ఆర్గనైజర్ తరుణ్ తేజను పోలీసులు అరెస్ట్ చేయగా, పరారీలో ఉన్న విజయవాడకు చెందిన కార్తీక్, పృథ్విల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన మాదాపూర్ పోలీసులు, ఈ ముఠాకు ఇంకా ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయనే కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశారు.

# సింగరేణిలో దోపిడి పై సమగ్ర దర్యాప్తు జరగాలి

- **రూ.1,600 కోట్ల గల్లంతుపై సీఎం రేవంత్ ఉన్నతస్థాయి కమిషన్ వేయాలి.**
- **సీఎస్ఆర్, డీఎంఎఫ్ నిధుల మళ్లింపుపై శ్వేతపత్రం విడుదల చేయాలి.**
- **ఈ బాగోతాన్ని ప్రధాని మోదీ, అమిత్ షా దృష్టికి తీసుకెళ్తా.**
- **బీజేపీ జాతీయ నేత డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి.**

**హైదరాబాద్, మహా :** సింగరేణి సంస్థలో చోటుచేసుకున్నట్లు భావిస్తున్న భారీ అక్రమాలు, నిధుల మళ్లింపుపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉన్నతస్థాయి విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసి వాస్తవాలను ప్రజల ముందుంచాలని బీజేపీ జాతీయ నాయకులు, తమిళనాడుకర్ణాటక రాష్ట్రాల సహ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సింగరేణిలో సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని, తద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.1,600 కోట్లకు పైగా భారీ గండి పడిందన్న ఆరోపణల నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు జరిపించి తీరాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యవహారంపై నిష్పాక్షిక విచారణకు ఆదేశించి తమ ప్రభుత్వ పారదర్శకతను నిరూపించుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో కొత్తగూడెంలో చేపట్టిన సింగరేణి క్వార్టర్ల నిర్మాణం, కిష్టారం గ్రామ సమీపంలోని సైలో బంకర్ నిర్మాణం, గనుల కేటాయింపులతో పాటు పలు ప్రాజెక్టుల అప్పగింతలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. ఈ అక్రమాలపై తాము గతంలోనే తీవ్ర స్థాయిలో పోరాటాలు చేశామన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రజల ప్రాణాలు, రాష్ట్ర సంపదతో కొందరు ప్రభావశీల వర్గాలు చెలగాటం ఆడుతున్నాయనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, వాటన్నింటినీ పూర్తిగా నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు. కేవలం బొగ్గు, నిర్మాణాల్లోనే కాకుండా సింగరేణి సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ), డీఎంఎఫ్ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్) నిధుల వినియోగంలోనూ భారీ స్థాయిలో గోల్‌మాల్ జరిగిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ నిధులను ఏయే ప్రాజెక్టులకు ఖర్చు చేశారు, ఎక్కడికి మళ్లించారు అనే పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని ఆయన పట్టుబట్టారు.

సింగరేణి కార్మికుల కఠోర శ్రమతో నిర్మితమైన ఈ ప్రజా సంపదను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కుంభకోణంపై వస్తున్న ప్రతి ఆరోపణపైనా నిష్పాక్షిక విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే సమయంలో సింగరేణి వ్యవహారంపై జాతీయ స్థాయిలోనూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ మొత్తం వ్యవహారాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకువెళతానని, అలాగే కేంద్ర హోంమంత్రి అమిత్ షాను స్వయంగా కలిసి సింగరేణికి సంబంధించిన అన్ని ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలని కోరనున్నట్లు డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి వెల్లడించారు.

# ఫ్రాన్స్‌లో ప్రధాని మోదీ పర్యటన

- **'భారత్ ఇన్నోవేట్స్' ప్రారంభం.**
- **చారిత్రక 'విల్లా కెర్లియోస్'ను సందర్శించిన మోదీ, మేక్రాన్.**
- **దేశంలో స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరిస్తుందని ప్రధాని స్పష్టీకరణ.**
- **ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంలో మోదీ పాత్ర అద్భుతమన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు.**



**ఢిల్లీ, మహా:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫ్రాన్స్ పర్యటన అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతోంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ప్రత్యేక ఆహ్వానం మేరకు శనివారం ఫ్రాన్స్ చేరుకున్న ప్రధాని మోదీ.. ఆదివారం అక్కడి నీస్ నగరంలో విస్తృతంగా పర్యటించారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ఇద్దరు నేతలు పలు కీలక అంశాలపై చర్చలు జరపనున్నారు. ఈ పర్యటనలో భాగంగా సాంకేతికత, సరికొత్త ఆవిష్కరణలు, పెట్టుబడుల ఆకర్షణ తదితర అంశాలపై ఇరు దేశాలు ప్రధానంగా దృష్టి సారించాయి.

నీస్ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ చారిత్రక 'విల్లా కెర్లియోస్'ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇద్దరు అగ్రనేతలు ఎంతో ఆత్మీయంగా ముచ్చటించారు. చారిత్రక కట్టడాన్ని కలియతిరుగుతూ తేలికపాటి సంభాషణల్లో మునిగిపోయారు. ఫ్రెంచ్ రివేరా తీరంలో, నీస్ మరియు మొనాకో నగరాల మధ్య ఉన్న బ్యూలీసర్‌మెర్ అనే ప్రాంతంలో ఈ అద్భుత కట్టడం ఉంది. క్రీస్తుపూర్వం 2వ శతాబ్దానికి చెందిన ఒక ప్రాచీన గ్రీకు ఉన్నత కుటుంబ నివాసాన్ని నమూనాగా తీసుకుని, 20వ శతాబ్దం ప్రారంభంలో ఆధునిక కాలంలో దీన్ని అత్యంత నిశితంగా పునఃసృష్టించారు. మధ్యధరా సముద్రానికి అభిముఖంగా ఒక రాతి ద్వీపకల్పంపై కొలువై ఉన్న ఈ హౌస్ మ్యూజియం భవనాన్ని ప్రస్తుతం చారిత్రక కట్టడంగా వర్గీకరించారు. దీని యాజమాన్య హక్కులను 'ఇన్‌స్టిట్యూట్ డి ఫ్రాన్స్' సంస్థ కలిగి ఉంది.అంతకుముందు, నీస్ నగరంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని ప్రధాని మోదీ, అధ్యక్షుడు మేక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సదస్సును ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. భారతదేశంలో ఆర్థిక, వాణిజ్య సంస్కరణల వేగం ఏమాత్రం తగ్గబోదని స్పష్టం చేశారు.> "గత 1112 ఏళ్లలో పటిష్టమైన ఆవిష్కరణల వ్యవస్థను మేము నిర్మించుకున్నాం. నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ అవతరించింది. దేశంలో స్టార్టప్ రంగం భవిష్యత్తులో మరింత విస్తరణకు సిద్ధంగా ఉంది. ప్రపంచ స్థాయి సవాళ్లకు సరికొత్త సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు నూతన ఆవిష్కర్తలు భారత్‌తో కలిసి అడుగులు వేయాలి." అని ప్రధాని మోదీ అంతర్జాతీయ సమాజాన్ని ఆహ్వానించారు.

ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకావడం ఫ్రాన్స్ దేశానికి ఎంతో గౌరవకారణమని అధ్యక్షుడు మేక్రాన్ హర్షం వ్యక్తం చేశారు. భారత దేశ నేతగా 12 ఏళ్ల ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు మోదీకి ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఫ్రాన్స్, భారత్ దేశాల మధ్య దౌత్య, వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయడంలో ప్రధాని మోదీ పోషిస్తున్న కీలక పాత్రను మేక్రాన్ ప్రశంసించారు. కాగా, ఈ సదస్సుకు ముందే ప్రధాని మోదీ పలువురు అంతర్జాతీయ ఇన్వెస్టర్లు, వెంచర్ క్యాపిటల్ సంస్థల అధిపతులతో ప్రత్యేకంగా సమావేశమై భారత్‌లో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలపై చర్చించారు.

# ఖరీఫ్‌కు ప్రత్యామ్నాయ సాగు ప్రణాళిక సిద్ధం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- **తక్కువ నీటితో సాగయ్యే పంటలపై వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యాచరణ.**
- **87.49 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో.. జిల్లాల్లో ముందస్తు నిల్వలు.**
- **ఎరువుల బుకింగ్ యాప్‌లో మార్పులు.. మీసేవ ద్వారా కూడా అవకాశం.**
- **వాట్సాప్ ద్వారా 28 లక్షల మంది రైతులకు వాతావరణ సలహాలు.**



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలోని రైతాంగం కేవలం వరి పంటపైనే ఆధారపడకుండా కందులు, పెసలు, మినుములు, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్న, నువ్వులు, ఆముదం వంటి తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడించారు. ఆదివారం ఖరీఫ్ సీజన్ సన్నద్ధతపై వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విత్తనాల కొరత ఎక్కడా తలెత్తకుండా ఈ ఖరీఫ్ సీజన్‌కు గాను రికార్డు స్థాయిలో 87.49 లక్షల క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచామని స్పష్టం చేశారు. కందులు, జొన్నలు, మొక్కజొన్న, సజ్జలు వంటి ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ఇప్పటికే అన్ని జిల్లాల్లో ముందుగానే నిల్వ చేసినట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయంగా కలవరపెడుతున్న ఎల్‌నినో ప్రభావాన్ని తాము ముందుగానే అంచనా వేసి ఏప్రిల్ నెలలోనే వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వాతావరణ శాఖ నిపుణులతో సమగ్రంగా సమీక్షించామని, అందుకనుగుణంగానే ఈ ముందస్తు సాగు ప్రణాళికను రూపొందించామని తెలిపారు. వర్షాలు ఆలస్యమైనా, ఒకవేళ తక్కువగా నమోదైనా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ ప్రత్యామ్నాయ వ్యూహం ఎంతగానో తోడ్పడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

గత రబీ సీజన్‌లో రైతుల నుంచి వచ్చిన క్షేత్రస్థాయి సూచనలు, అభిప్రాయాల ఆధారంగా రాష్ట్ర ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌లో ప్రభుత్వం పలు కీలక మార్పులు, మెరుగుదలలు చేసిందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వివరించారు. జిల్లా వారీగా డీలర్ల వద్ద ఉన్న స్టాక్ నిర్వహణ, మండల మ్యాపింగ్ సదుపాయాలతో పాటు ఈసారి సరికొత్తగా మీ సేవ కేంద్రాల ద్వారా కూడా ఎరువులను బుక్ చేసుకునే సులభతర సౌకర్యాన్ని కల్పించినట్లు చెప్పారు. ఈ సరికొత్త యాప్ వినియోగం వల్ల ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద రైతులకు గంటల తరబడి వేచి ఉండే రద్దీ తగ్గడంతో పాటు పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపించే అవకాశం ఉన్నందున, వర్షపాతంలో అనిశ్చిత పరిస్థితులు, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి విభిన్న అంశాలను దృష్టిలో ఉంచుకుని తాము ముందస్తుగా పంటల ప్రణాళికలు, విత్తనాలు, ఎరువుల లభ్యతను పర్యవేక్షిస్తున్నామన్నారు. రైతులు కూడా స్థానిక వాతావరణ పరిస్థితులను నిరంతరం గమనిస్తూ వ్యవసాయశాఖ అధికారులు అందించే సాంకేతిక సూచనలను ఖచ్చితంగా పాటించాలని మంత్రి కోరారు.

రైతులకు ఖచ్చితమైన, సమయానుకూలమైన వాతావరణ సమాచారాన్ని డిజిటల్ మాధ్యమాల ద్వారా అందించేందుకు వ్యవసాయ శాఖ ప్రతిష్ఠాత్మకంగా "తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం" అమలు చేస్తోందని మంత్రి తుమ్మల తెలిపారు. ఈ అత్యాధునిక కార్యక్రమం ద్వారా మండలాల వారీగా కురిసే వర్షపాతం, ఉష్ణోగ్రతలు, గాలి వేగం తదితర అత్యంత కీలకమైన వాతావరణ వివరాలు నేరుగా రైతుల మొబైల్ ఫోన్లకు వాట్సాప్ సందేశాల రూపంలో చేరుతున్నాయని వెల్లడించారు. రైతులు క్షేత్రస్థాయిలో విత్తనాలు వేయడం, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, పంట సంరక్షణ చర్యలు వంటి అత్యంత కీలకమైన విషయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ఈ వాతావరణ సలహా కార్యక్రమం దిక్సూచిలా ఉపయోగపడుతోంది. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 28 లక్షల మందికి పైగా రైతులకు వాతావరణ సమాచార సందేశాలను విజయవంతంగా పంపించాం." అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు.

ప్రస్తుతం 71 శాతం విజయవంతమైన డెలివరీ రేటుతో ఈ వాతావరణ సమాచార కార్యక్రమం అద్భుతంగా కొనసాగుతోందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో రైతుల సాగు వ్యయాన్ని తగ్గించి, ఆదాయాన్ని గణనీయంగా పెంచడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాలను నివారించడమే ప్రధాన లక్ష్యంగా ఇటువంటి సాంకేతిక ఆధారిత వినూత్న కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు మరింత విస్తరించనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి స్పష్టం చేశారు.

# బరిమల గోల్డ్ స్కామ్ ముగింపు దశకు సిట్ విచారణ

- **ఛార్జిషీట్ దాఖలుకు ముందు ఆలయంలో తుది తనిఖీలు.**
- **ప్రభామండలం ప్లేట్లు, ద్వారపు ఫ్రేమ్‌ల నుంచి నమూనాల సేకరణ.**
- **శాస్త్రీయ నివేదికలతో లభించిన కీలక ఆధారాలు.. జూన్ 18న హైకోర్టులో విచారణ.**



**శబరిమల, మహా:** కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శబరిమల శ్రీ ధర్మశాస్త్ర ఆలయంలో తీవ్ర కలకలం రేపిన బంగారం కుంభకోణం (గోల్డ్ స్కామ్) కేసు దర్యాప్తు ముగింపు దశకు చేరుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆదివారం శబరిమల ఆలయంలో మరో దఫా కీలక తనిఖీలు చేపట్టింది. కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయడానికి ముందు జరుగుతున్న ఈ తుది దశ తనిఖీల్లో భాగంగా.. శాస్త్రీయ విశ్లేషణ కోసం ఆలయ ఆభరణాలను, ఇతర లోహపు వస్తువులను సిట్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.ఈ కేసులో వాస్తవాలను నిర్ధారించేందుకు కేరళ హైకోర్టు జూన్ 8వ తేదీన సిట్‌కు అత్యంత కీలకమైన అనుమతులు మంజూరు చేసింది. ఆలయంలోని ప్రభామండలం ప్లేట్లు, పైభాగంలోని ద్వారపు ఫ్రేమ్‌లను విప్పదీసి, వాటి నుంచి నమూనాలు సేకరించేందుకు న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సదరు లోహపు వస్తువుల తయారీలో అసలు ఎంత మేర బంగారం వాడారు, ఎక్కడెక్కడ అవకతవకలు జరిగాయనే విషయాలను కచ్చితంగా తేల్చడానికి ఈ శాస్త్రీయ విశ్లేషణ ఎంతో తప్పనిసరి అని కోర్టు అంగీకరించింది. గతంలో ఆలయ స్తంభాలు, ఇతర ప్రధాన భాగాల నుంచి సేకరించిన 36 నమూనాలను అధికారులు ఇప్పటికే జంషెడ్‌పూర్‌లోని నేషనల్ మెటలర్జికల్ లాబొరేటరీ (ఎన్ఎంఎల్), అలాగే తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (విఎస్ఎస్సి)లకు పంపించారు. ఈ ప్రతిష్ఠాత్మక సంస్థలు అందించిన శాస్త్రీయ నివేదికల ఆధారంగా.. ఈ బంగారం స్కామ్ అసలు ఎలా జరిగిందనే దానిపై సిట్ అధికారులకు పూర్తి స్పష్టత వచ్చింది.

గత 2025వ సంవత్సరంలో శబరిమల ఆలయంలోని ద్వారపాలకుల విగ్రహాల తొలగింపు వ్యవహారంపై వెల్లువెత్తిన వివాదం, తదనంతర అక్రమాలపై దర్యాప్తు దాదాపుగా పూర్తయిందని సిట్ వెల్లడించింది. ఇందుకు సంబంధించిన వాస్తవాలతో కూడిన తుది నివేదికను (ఛార్జిషీట్) త్వరలోనే న్యాయస్థానంలో దాఖలు చేస్తామని దర్యాప్తు బృందం స్పష్టం చేసింది. ఈ కేసులో చోటుచేసుకున్న తదుపరి పరిణామాలు, ఇందులో ప్రమేయం ఉన్న వారి నేరాల నిర్ధారణపై సమగ్ర సమీక్ష జరిపేందుకు కేరళ హైకోర్టు తదుపరి విచారణను జూన్ 18వ తేదీకి వాయిదా వేసింది. కోట్లాది మంది భక్తుల సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న శబరిమల ఆలయంలో ఈ విచారణ ముగింపు దశకు చేరడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది.



# వైసీపీ ఫేస్ బుక్ పేజీ మాయం

**అమరావతి, మహా:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) అధికారిక ఫేస్‌బుక్ పేజీ భారతదేశంలో ఎక్కడా కనిపించకుండా పోయిందని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలోని చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ఆయన పదునైన విమర్శలు గుప్పించారు. తమ పార్టీ అధికారిక ఫేస్‌బుక్ పేజీని ఉద్దేశపూర్వకంగానే కనిపించకుండా చేశారని, ఇది ముమ్మాటికీ ప్రతిపక్షాల గొంతు నొక్కే చర్యేనని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను, సాగుతున్న అవినీతిని సాక్ష్యాధారాలతో ప్రశ్నిస్తున్నందుకే కక్షపూరితంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది ప్రారంభంలోనే తమ పార్టీకి చెందిన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను అకస్మాత్తుగా తొలగించారని, ఇప్పుడు అదే తరహాలో ఫేస్‌బుక్ పేజీని లక్ష్యంగా చేసుకుని నిలిపివేశారని జగన్ ఒక అధికారిక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

# రాహుల్ గాంధీ అవాస్తవ భయాలు సృష్టిస్తున్నారు

## నిర్మలా సీతారామన్

**ఢిల్లీ, మహా:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీని విమర్శించే క్రమంలో దేశం సాధించిన విజయాలను తక్కువ చేస్తున్నారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విమర్శించారు. బెంగళూరులో జరిగిన 'వికసిత్ భారత్ సంకల్ప' సదస్సులో ఆమె మాట్లాడుతూ, దేశంలో సంక్షోభం లేకపోయినా పెద్ద విపత్తు రాబోతోందంటూ ప్రజల్లో అనవసర భయాలు సృష్టిస్తున్నారని అన్నారు. మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని, భారత్ ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని పేర్కొన్నారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.




# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలి

- **బలవంతపు పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలపై చర్యలు తీసుకోవాలి**
- **ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు, యూనిఫాంలు, స్టేషనరీ వస్తువులను బలవంతంగా విక్రయిస్తూ, విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ ఆరోపించారు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో అంబేద్కర్ భవన్లో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ ముఖ్య కార్యకర్త సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బేగరీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ... విద్యను వ్యాపారంగా మార్చి ఇష్టానుసారంగా ఫీజులు పెంచడం బాధాకరమన్నారు. విద్యార్థులు పాఠశాలల వద్ద నుంచే పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తేవడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న, బలవంతంగా పుస్తకాలు-యూనిఫాంల విక్రయాలను చేస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శి చరణ్ గౌడ్, మాల చందు, డివిజన్ ఉపాధ్యక్షులు మణికంఠ, డివిజన్ నాయకులు వినోద్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 15-06-2026
సాహిత్యం నిర్వహణ హనీఫ్ 04

## 20న నాన్న చెక్కిన శిల్పం ఆవిష్కరణ సభ

ప్రముఖ రచయిత జాలాది రత్న సుధీర్ రచించిన నాన్న చెక్కిన శిల్పం ఆవిష్కరణ సభ 20 జూన్ 2026 శనివారం సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. తెలంగాణ సాహత్య అకాడమీ వారి 'సాహిత్యవారం'లో భాగంగా జరిగే ఈ సభలో నామోజు బాలాచారి, ఏనుగు నరసింహారెడ్డి ఐ.ఏ.ఎస్, ఏ.దినకర్ బాబు ఐ.ఏ.ఎస్. (రి), డాక్టర్ ఎస్. రఘు, డాక్టర్ నీలిమ వి.ఎస్.రావు, సి.ఎస్. రాంబాబు, గుడిపాటి, వి.వి.ఎన్. దిలీప్ ప్రభృతులు ప్రసంగిస్తారు. ఫాదర్స్ డే జూన్ 21న వుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ముందుగా జూన్ 20 న ఈ సభ జరుగుతుంది.

**గుడిపాటి పాలపిట్ట బుక్స్**

## మల్లెల పరిమళం

వీధి అంతా మల్లెల పరిమళమే.. అవును
మల్లెలమ్ముతూ పూల వాడు అటు వెళ్ళాడు!
నిజం మంచి మనసు ముందు మన బతుకు
పరిమళమే!
తేటతెల్లమైన మన అస్తిత్వాలు నిసిగ్గుగా
అహంతో రంకెలు వేస్తాయి వేల నాటకాలలో
తమని తాము దాచుకుంటాయి
కొండల్లో నుండి పారుతూ స్వచ్ఛమైన జలంలా
ఓ నవ్వు మనల్ని తాకినప్పుడు
మన వేషాలు నగ్నత బట్టబయలౌతుంది
ఎవ్వరూ మొరపెట్టుకోకండి .. మనుషులు
మారుతారని భ్రమించకండి...
మీ తోవన పోతూ
అందరికీ అభివాదం చేస్తూ నమస్కరిస్తూ
పొండి!
నిజం చెప్తున్నాను ఘర్షణలు
కేవలం అపోహలే!
ఎవరికి మీ నిజాయితీని
స్నేహాన్ని వివరించకండి!
మల్లెల పరిమళమై సాగిపొండి!!

**తంగెళ్లపల్లి కనకాచారి**
**8790874028**



## పండిన ప్రేమ

నువు కూర్చున్నపుడు
నారింజ మేఘాలు నీ ప్రక్కన
కూర్చుంటాయి

కనురెప్పలు పైకెత్తినపుడు
నీ చూపులు సీతాకోకలయి ఎగురుతాయి

మాటలకై పెదవులు తెరిచినపుడు
తేలికగాలులలో పరిమళాలు
మునకలేస్తాయి

లోపలినుండి చిరునవ్వు నవ్వినపుడు
ఎవరం పోటీ పడదామని
నక్షత్రాలూ, సూర్యుడూ తడబడతారు

ప్రపంచం మీద ప్రేమతో
నీ హృదయం నిండినపుడు
చంద్రుడు తృప్తిగా బెంగ విడుస్తాడు
ఇవాళొక హృదయం ఆశ్రయం
ఇచ్చిందని

ఇంతకూ నువు ఏ ఒకర్నీ ప్రేమించలేదు
నీలో ఇంత అందానికి

జీవితాన్ని ప్రేమించి, ప్రేమించి
జీవితానివీ, ప్రేమవీ అయిపోయావు
కదులుతున్న రాత్రిలో రాత్రిలా
కరిగిపోయావు


**బివివి ప్రసాద్**
**90320 75415**

# సాహిత్య విమర్శకుడిగా ముక్కామల చక్రధర్

సీనియర్ జర్నలిస్టుగా, కథకుడిగా గుర్తింపునొందిన ముక్కామల చక్రధర్ విమర్శకుడిగా తెరిచిన "మూడో కన్ను" ఇప్పుడు మన ముందు ప్రత్యక్షమైంది. ఇది సాహిత్య విమర్శా వ్యాసాల సంపుటి. ఇందులో కవులు కథకుల వ్యక్తిత్వాలు, వారి సాహిత్య కృషిని తెలిపే వ్యాసాలు ఉన్నాయి.

"అతడు... అల్లం రాజయ్య.."+. ఇన్ని సంవత్సరాల తర్వాత తిరిగి చదివితే 'మహాదేవుడి కల' నాదే కావడం, నేనే ఇన్నాళ్లు అలాంటి కలను కంటూ బతుకుతున్నాననే స్పృహలోకి రావడం, నన్నే పిచ్చి వాడిని చేశారన్న నిజం, ఈనాడు ఎరుకలోకి వచ్చిన అనుభవం అని జ్ఞాపకం చేసుకుంటారు. సామల సదాశివ గారిని 'యాది' చేసుకోవడం అంటే ఆనాటి తరాన్ని కాదు. అప్పటి అనుబంధాలను గుర్తు చేసుకోవడమే నంటారు. తెలంగాణ కోటి రతనాల వీణలా, ఓ రత్నంలా ఒదిగిన, తెలంగాణ సమాజం తలెత్తుకునేలా చేసిన కవి దాశరధి కృష్ణమాచారి. సాహిత్య ప్రముఖులు కోవెల సంపత్ కుమారాచార్య, చేకూరి రామారావు స్నేహితులే అయినప్పటికీ సాహిత్య వివాదాల్లో ఒకరికొకరు తలపడతారు. సాహిత్యమే మన వైరుధ్యం తప్ప మనం ఎప్పటికీ స్నేహితులమే అని తేల్చి చెప్పిన తీరు, సాహిత్యకారులందరికీ ఆదర్శప్రాయం. పద్యాన్ని అంతర్లీనంగా ఏదో దాగి ఉందన్న భ్రమను కల్పించేలా పాఠకున్ని తన వెంట తిప్పుకోవడం సీతారాం కవిత్వ సొబగు. పువ్వులే పండుగ. అవును. పూలతో పరవళ్ళు తొక్కుతూ మహిళలు, చిన్నారులు లయబద్ధంగా నృత్యాలు చేస్తూ సామూహికంగా పండుగను జరుపుకోవడం మీకెక్కడైనా కనిపించిందా అదే బతుకమ్మ పండుగ. పసునూరి రవీందర్' మీది మీదే.... మాది మాదే' అంటున్నారు. ఈ సరికొత్తవాదంలో తెలంగాణ రావాలని కాంక్షించిన జన్మతః ఆంధ్రులమైన మాలాంటి వాళ్ళం ఎటువైపు ఉంటామన్నదే నా ప్రశ్న. నిజానికి దశాబ్దాల పాటు అనేకానేక యుద్ధాలు చేసినవాడు. కాబట్టి అఫ్సర్ ఆ యుద్ధం మధ్యలో ఎలా ఉంటుందో చెప్పగలిగాడు. నన్ను అపాదమస్తకం కదిపే... కుదిపే దీపకళిక "పుస్తకం". అది రహస్య జీవితపు వాసనలను నలుచెరుగులా ప్రవహింపజేసే జీవనది అంటారు. నగ్నముని అనే "దిగంబరకవి తో కొన్ని గంటలు" హోటల్ లో గడిపితే గది అంతా కవిత్వమై గుబాళించిందంటారు. ప్రజా కవిత్వాన్ని పట్టుకోవడం ఎలాగో, ఇదిగో ఇలాంటి వాళ్లు నేర్పిస్తారని తెలుసుకుంటాడు. ఈ డాక్టరమ్మ సంపాదించాల్సింది డబ్బులు కాదని, సమాజం పట్ల కాసింత ప్రేమనే ఎరుకతో చాలా సాహిత్యాన్ని సృష్టిస్తున్నారని కాళ్ళకూరి శైలజ గురించి చెబుతారు. మనం గుర్తించలేకపోయాం. సుమనశ్రీ అనే కవినే కాదు. ఆయన మరణాన్ని కూడా.. అనే సంతాప ప్రకటన కూడా ఇందులో ఉంది.

మనుషుల గురించి, బతుకుల గురించి, వెతల గురించి, వేదనల గురించి రాయకుండా ఇంకేది రాసినా అది కవిత్వం అవుతుందేమో, కానీ ఇలా జూకంటి రాసిన మంచి కవిత్వం మాత్రం ముమ్మాటికి కాదు. నరేష్ కుమార్ సూఫీ అని కుర్రకవి మొత్తం దేశానికే సంకెళ్లు తయారు చేసి పనిలో ఉన్నాడని తెలుసుకొని, ఇప్పుడు వీస్తున్న గాలిని గుండెల నిండా పీల్చుకోకుండా ఎలా ఉంటాం అని ప్రశ్నిస్తారు. తన చుట్టూ ఉన్న ప్రపంచాన్నే, తాను అనుభవించిన ప్రపంచాన్నే, అనుభవించని ప్రపంచాన్నే, దారితప్పిపోయిన ప్రపంచాన్నే కవిత్వం చేశారు. అందుకే విమల అందరిలాంటి కవయిత్రిగా కాకుండా మిగిలారు. కవి చేసే అంతర్ బహిర్ ప్రయాణమే అతని కవిత్వం. మూడు సంపుటాలతో ఇప్పటికే మంచి కవిగా ముద్ర వేయించుకున్న వసీరా, తన నాలుగో సంపుటితో ఆ ముద్రను శాశ్వతం చేసుకున్నాడు. కవిత్వమంటే మనల్ని మనం పుటం పెట్టుకుని మనిషి రూపం దాల్చడం. ఇదంతా ఎలా అంటారా, ఇదిగో ఈ నెల్లూరు అమ్మాయి సుధా మురళి లాగన్నమాట. కవిత్వ దారి తెలుసుకోవడానికి చేసే ప్రయత్నాలు వ్యర్థమే కదా. ఎక్కడో ఒకచోట ముగిస్తుందని, అది ఎక్కడ అని అన్వేషించడం వినా కవులు చేసే పని ఏముంటుంది కనుక. ఈ శ్రీధర్ బాబు కూడా అదే పని చేస్తున్నారు.ఈ వృద్ధాప్యంలో తాను ఒక్కడి




నే చెప్పగలనన్న విశ్వాసంతో చెప్పిన ప్రేమ పద్యాల తోరణమే శివారెడ్డి రాసిన "Ode to love ..అను ప్రేమ గీతం". ఇది చదివితే ఏం కాదు. నిజంగా ఏం కాదు. ప్రేమించాలనిపిస్తుంది అంతే.. అందరినీ.. అంతటినీ.. ఎవరి ప్రాపకం కోసమో ఏదైనా చేయవచ్చు. కానీ ఇలా కాగితాల మీద కారం చల్లడం మాత్రం విధ్వంసక చర్యే. జర్నలిస్టు మిత్రుడు ఆలపాటి సురేష్ ఈ మధ్య రాసిన అలాంటి పుస్తకం "విధ్వంసం" గురించే మాట్లాడుతున్నాను.ఇప్పుడు వివ కవిత్వంలో నన్ను చూసుకున్నాను. వెండి రూపాయి బిళ్ళ లాంటి పాదాలు, లేత నారుమడి లాంటి పాదాలు మనల్ని తమ వెంట కవిత్వ నదిలోకి తీసుకుపోతాయి. రాధ గారు వ్రాసిన "యుద్ధ విరామం" కవిత చదివిన తర్వాత, ఓ సాధారణ గృహిణి యుద్ధ బీభత్సాన్ని ఇంత అనుభవించిందా మనుషులు మాత్రమే లోకంలో ఉండాలని కాంక్షిస్తే తప్ప ఇంత భయాన్ని చెప్పగలమా అసలు యుద్ధంలేని ఓ జీవితాన్ని కోరుకుంటే తప్ప ఇంత విశాలమైన భావాన్ని చెప్పగలమా? ఇలా చెప్పడానికి ధైర్యం కావాలా అని ప్రశ్నిస్తారు. "కవితో ఓ సాయంత్రం" హెచ్చార్కే బతుకు మీద ఆశను రేకెత్తించాడు. సృజనకారుడు ఇదే చేయాలి. ఎండ్లూరి సుధాకర్ అనే మనిషి తన జీవధర్మాన్ని అనుసరించి వెళ్లిపోయాడు. అతని కవిత్వం మాత్రం ఆచంద్రతారార్కం చిరాయువుగా మిగిలిపోయింది. చాలా కాలం తర్వాత కవిత్వ ఆత్మను రుచి చూపించిన కవి బహుశా బీబీవీ ప్రసాద్ మాత్రమే. లేత అరిటాకు చివర మెరుస్తున్న మంచి బిందువులా ఉంటుంది ప్రసాద్ కవిత్వం. నా వరకు నగ్నముని తెలుగు సాహిత్యం ఎప్పుడో చేసుకున్న పుణ్యఫలం. కొండకచో.. పాప ఫలం కూడా.. వరవరరావు సిద్ధాంతాలు, దానిమీద జరుగుతున్న రాద్ధాంతాలు పక్కన పెడితే కవిగా వరవరావు తెలుగు సాహిత్యం పై బలమైన ముద్ర వేసిన కవి. బహుశా ఆయన వ్యక్తిత్వం కూడా ఇందులో భాగస్వామే. ఎవరైనా కవులను తయారు చేస్తారా? ఎవరైనా తమంత తామే కవులుగా ఎదుగుతారు. కానీ అద్దేపల్లితో పరిచయం ఉన్నవారు ఎవరైనా కవులుగా మారాల్సిందే. కలంపట్టి కవిత్వం రాయాల్సిందే. అలా ఉంటుంది అద్దేపల్లి తో స్నేహం. ఈ స్నేహానికి కూడా వయోభేదాలు ఉండవు. గొప్ప కవి శివారెడ్డి చుట్టూ నేటి కుర్ర కవులు తిరుగాడుతున్నట్లుగా, ఆనాడు కుందుర్తి వెంట ఆనాటి యువ కవులు తిరిగేవారు. సాహిత్య గంప కింద ఆ యువతరాన్ని కాపాడటమే కాదు. తల్లి కోడిలా వారందరినీ కుందుర్తి సాహిత్యవృక్షం కింద సేద తీరేలా చేసేవారు. తాను నవ్వడమే కాదు. తన చుట్టూ ఉన్నవారు కూడా నిత్యం నవ్వేలా బతికారు సుగం బాబు. ఆయనతో గడిపిన ఆ క్షణాలను ఎప్పుడూ గుర్తు చేసుకుంటాను. ఆ రోజుల్లో ఎవడు మాట్లాడితే, నవ్వితే, నడిస్తే, ఎదురుపడితే, దిక్కరిస్తే కవిత్వమైందో వాడే త్రిపురనేని శ్రీనివాస్. తెలుగు సాహిత్యాన్ని ఎంత కుదుపు కుదిపింది ఈ 'నీలి మేఘాలు'. చెప్పు ఎటు నిలబడతావో చెప్పు అంటూ తెలుగు సమాజాన్ని కాలర్ పట్టుకుని అడిగింది ఈ నీలి మేఘాలే. ఆంధ్రీ కుటీరంలో అడుగుపెట్టడం నా మటుకు నాకు సరస్వతీ దేవి సందర్శనగానే తోచింది. నేపాన్ని కాసేపు ఆయుర్వేదం వైపు నెట్టేసి చుట్టూ పుస్తకాల మధ్య, అప్పుడప్పుడు పొగ చూరుతున్న నేటి మధునా పంతులు గారి పద్యప్రవాహంలో తానమాడడం ఓ తీయని జ్ఞాపకం. తెలుగు సాహితీ ప్రియులకి మాత్రం ఇంద్రగంటి ఇచ్చిన ఆస్తి మంచి కవిత్వం. అంతకంటే మరింత చక్కని వచనం. శిఖామణి కి కవిత్వం అంటే ఎంత గౌరవ గర్వమో. కాకపోతే పదేళ్లుగా కవిత్వం కోసం ఎంత చేస్తున్నాడు గౌరవంగా. తాను ఒక్కడే చేస్తున్న కవి సంధ్య అంత గర్వంగా. కోయి కోటేశ్వరరావు రాసిన కవిత్వం పూల పరిమళం అయితే, ఆయన కవిత్వ కార్యకత్వం పూల పందిరీల తీగ .నిరంతరం పరిమళిస్తూనే ఉంటుంది. అద్దేపల్లి ప్రభ ఊహాతీతపు ఆనవాళ్ళ కోసం వెతుక్కునే కవిగా తన ప్రయాణాన్ని ప్రారంభించలేదు. నెర్రెలు వారిన జీవితాలను చూసిన కళ్లు కదా! ఆ జీవితాలని తెల్ల కాగితాలపై ఎర్ర ఎర్రగా పరిచాడు. శివుడూ! నువ్వు ఈ రోజే కొడుకుని పోగొట్టుకున్నావ్ అనుకుంటుంది ఈ లోకం. ఈ భూమిపై జరిగిన ప్రతి ఎన్కౌంటర్ లోను నీ కొడుకుల్ని, బిడ్డల్ని పోగొట్టుకుంటూనే ఉన్నావు అని శివారెడ్డిని ఓదారుస్తాడు.

రావిశాస్త్రి గారు ఎంత పెద్ద రచయితో అంత పెద్ద మనసున్న మనిషి. తనకు నచ్చిన రచన కానీ, రచయిత కానీ తారసపడితే దాన్ని ఆయన భుజాల మీదకు ఎత్తుకొని ఇంటింటికి మోసుకుపోయేవారు." గెలుపు సరేనర్రా... బతకడం ఎలా" అని నిలదీసినవాడే పతంజలి. చింగిజ్ అయిత్ మాతోవ్ రాసిన "జమీల్యా", మారుతి పౌరోహితం రాసిన "హంపి" కి మధ్య అనేకానేక పోలికలు కనపడతాయి. ఈ రెండు నవలల నేపథ్యం యుద్ధము ప్రేమే కావడం యాదృచ్ఛికం కానే కాదు. బమ్మిడి సరోజినమ్మ బాల సాహిత్యానికి మంచి గుర్తింపు తెచ్చింది. తల్లుల పిల్లలకి రోజూ జానపద గాథలు, తాము చూసిన అనుభవించిన సుఖాలు సంతోషాలు, వేదనలు వెక్కిరింతలు కథలుగా చెప్తే ఆ పిల్లలు కథకులైపోతారని రుజువు చేసిందా తల్లి. కాశీభట్ల... ఓ శాపగ్రస్తుడు. తెలుగు సమాజంలో పుట్టాడు అని నిర్ధారించారు. నిన్ను, నీ జీవితాన్ని లోపలికంటా పరికించి చూసేలా కథలు రాసినాయనే తల్లావజ్ఝుల పతంజలి శాస్త్రి గారు. ఇప్పుడంటే న్యాయదేవత కళ్ళకు కట్టిన గంతలను తొలగించారని వార్తలు వస్తున్నాయి. కానీ ఆ కళ్ళకు కానరాకుండా సాయిబాబా పై నేరపిన కుట్రలను ఎవరు మాత్రం బహిరంగపరచగలరు.

పుస్తకం మానవుల్లో మార్పు తీసుకురావాలి పుస్తకం మానవుల్లో చైతన్యం తీసుకురావాలి. ఈమధ్య శుభకార్యాల్లో ఫ్యాషన్ గా మారిన రిటర్న్ గిఫ్ట్ లో పుస్తకాలు ఇస్తే ఎంత బాగుంటుందో కదా. కవులు రచయితల గురించి ,వారి హాస్య ప్రియత్వం గురించి కొన్ని సంగతులు. చాలా సీరియస్ రచనలు చేసే రచయితలు హాస్య ప్రియత్వంతో ఉంటారని, హాస్యం వెటకారం పలికించే రచయితలు సీరియస్ గానే ఉంటారని పెద్దగా ఎవరికి తెలియదు అని 'సాహిత్య మరమరాలు' లో చెబుతారు. ఓ కథ అనండి. కవిత్వం అనండి. వ్యాసం అనండి. రాజకీయ విశ్లేషణ కానివ్వండి. దాన్ని చదివి ప్రభావితమయ్యే వారు చాలామంది ఉంటారనే ఎరుక ఆయా రచయితల్లో ఉండాలి. ఆ రచన ప్రభావం ఇతరులపై ఎంత ఉంటుందో తెలుసుకోవాలి. కొత్త దేవుళ్ళు ఈ మధ్యనే పబ్లిషర్స్ అవతారం ఎత్తి తెలుగు కథ, కవిత్వం, విమర్శలను రక్షించే పనిలో పడ్డారు. దేశభక్తి కంటే హీనమైన పాపానికి ఒడిగడుతూ తెలుగు కవులు, రచయితలను ఉద్ధరించే పనిలో చాలా బిజీగా గడుపుతున్నారు. 'ద్వారక 'లాంటి సత్రాలు ఎంత సాహిత్య పంటను సృష్టించాయో నేటి కవిత్వం, కథలు, విమర్శ చదివితే అర్థం అవుతుంది. ఇలాంటి సత్రాలు తెలుగు రాష్ట్రాల్లో చాలా చోట్ల ఉన్నాయి, ఉంటాయి. లక్షలాది రూపాయలు సాహిత్యం కోసం ఖర్చు చేస్తూ, అందరినీ ఆహ్వానిస్తున్న మర్యాదరామన్నలు ఈ ఖమ్మం సాహిత్య వాసులే అని ప్రస్తుతిస్తారు.

ముక్కామల చక్రధర్ తనకు తెలిసిన, తను అభిమానించే సాహిత్యకారుల వ్యక్తిత్వాలను సాహిత్యాన్ని దగ్గరగా చూసినందు వల్ల వాటి గురించి పాఠకులకు వివరిస్తూ, ఈ వ్యాసాలను రాయగలిగారు. ఇందులో కవులు, కథకులు, నవలాకారులు ఉన్నారు. ఆత్మీయంగా రాసిన ఈ వ్యాసాలు క్లుప్తంగా ఉన్నాయనిపించడానికి కారణం, ఇవి కాలమ్ వ్యాసాలు కావడమే. ఉన్న పరిమితులలోనే ఈ వ్యాసాలను చక్కగా రూపొందించడంలోనే చక్రధర్ ప్రతిభ దాగి ఉంది.ఈ వ్యాసాలను కొంత విమర్శనాత్మకంగా, కొంత వ్యంగ్యాన్ని జోడించడంలో పాఠకుడికి ఆసక్తి కలిగించడమే కాకుండా, చివరిదాకా హాయిగా చదివింపజేస్తాయి.



**- కె.పి అశోక్ కుమార్,**
**97000 00948**

## జీవితానికి దగ్గరగా జరిగి జీవించు

మౌనంగా చూసే కళ్లమీద
నిఘా ఎక్కువగా వుంటుంది
శోకుతో నవ్వే నవ్వుల వెనుక
దాచిపెట్టిన బాధ వుంటుంది

కాలం కరిగిపోతూ మాయమవుతుంటుంది
కన్నీళ్లు దారిని, అడుగులను మార్చలేవు

నన్ను నేను మరిచిపోయినా
నాకు మీరు జ్ఞాపకముంటారు
మీ మీదున్న నా ప్రేమను ఎలా చూపించాలి
నేను రాసేదంతా మీ మీది బెంగతోనే

పూలదగ్గర ముళ్లు చూశాను
పారే నీళ్లకు, రాళ్లను అడ్డు తీశాను
బద్నాం అయ్యాను, బర్బాద్ అయ్యాను
ఎప్పుడూ ప్రేమను వదిలేయలేదు

ఎలాగైనా వుండనీ, జీవితం చాలా గొప్పది
ఒక్కొక్క క్షణాన్ని, ఎవరు దోచుకోకుండా చూసు
కోవాలి

వదులుకున్న సమయం మళ్లీ రాదు
నొప్పిగా, బరువుగా జ్ఞాపకాని కొస్తుంది

జీవితానికి, దగ్గరగా జరిగి జీవించు
అర్థం చేసుకోవడానికి ప్రయత్నించకు

ఎవరికో మిత్తి కడుతున్నట్టు
జీవితాన్ని ఖర్చు చేయకూడదు

మనసు చెప్పినదాన్ని తేలిగ్గా తీసుకోవద్దు
జీవితం చిన్నప్పుడు చూసిన స్వప్నం కాదు

నిజానికి, జీవితం జీవితంగా గడిపేదికాదు
అది బరువైన బాధ్యత

మనిషి, స్నేహాలలో, బంధాలలో సంతోషాలు
పంచుకోవడం కన్నా,
కష్టాలను, నష్టాలను మోయడంలోనే గడుపు
తాడు

మనుషుల మీద మనసు విరిగి పోవచ్చు
జీవితం మీది నమ్మకం సడలిపోవద్దు



**ఆశారాజు**
**9392302245**

# సొక్కపు సక్కదనాల తెలంగాణ పలుకుబడులను పొందిచ్చిన వయ్యి

కావ్య ప్రయోజనాన్ని పట్టుకోవడానికి పాఠకులు కనీస భాషా పరిజ్ఞానం కలిగినవారై ఉండాలి. అందులోని పదాలకు, దీర్ఘ సమాసాలకు, కఠినమైన వాక్యాలకు, అర్థాలు తెలిస్తేనే చదువరులకు కావ్య అంతరార్థం అవగతమవుతుంది. పఠితులకు గ్రంథస్థ భాషకు సంబంధించిన కనీస అవగాహన ఉంటేనే కావ్య పఠనం సుసాధ్యం. వ్యవహారభాషలో వచ్చిన కావ్యాలకు ఇన్ని తెలిసుండాల్సిన అక్కర్లేదు. జానపదుల నోటి నుండి వచ్చే ప్రతి మాటను అక్షర బద్ధం చేస్తే, అది సకలజనుల పఠనీయ కావ్యమవుతుంది. నేటి ఆధునిక కాలంలో ఈ జన వ్యవహారశైలికి సంబంధించిన పదబంధాలు, సామెతలు, నుడికారాలు, జాతీయాలు తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ఉద్యమ కాలం నుండి మనతో నిత్యం మమేకమవుతూనే ఉన్నాయి. ఎందరో కవులు, రచయితలు ఈ తెలంగాణ నుడికారపు కమ్మదనాన్ని ఒడిసిపట్టి కవనసేద్యం చేస్తున్నారు. అందునా గ్రామీణ వాతావరణ నేపథ్యం, పల్లె పరిస్థితులను వర్ణించే కావ్యాలు రాసే కవులు, రచయితలు బహు అరుదుగా ఉంటారు. కానీ పల్లెపట్టుకు చెందినవారు అసలు, సిసలు తెలంగాణ భాషా పరిమళాలను వెదజల్లుతూ, కవనసేవలో రాణిస్తున్న మట్టిబిడ్డ, అస్తిత్వకవి కూకట్ల తిరుపతి గారు. ఈ మధ్య వీరి "ఆరుద్ర పురుగు" పుస్తకాన్ని బుక్ షెల్ఫ్ నుండి తీసి, కమ్మలు తిరిగేసాను. సందేశాత్మక కావ్య మనిపించింది. నాలుగు వాక్యాలు నాకు తోచినవి మీ ముందు ఉంచుతున్నాను. "ఆరుద్ర పురుగు" వయ్యి 37 కవితల సంపుటి. ఇందులో ప్రధానంగా పల్లె జీవన వర్ణన, ప్రకృతి చిత్రణ, వ్యవసాయ విధానం, పల్లెలో వున్న ఆచారాలుసంప్రదాయాలు, ముదుపులుమొక్కుబడులు, తెలంగాణ స్వరాష్ట్ర కాంక్షపోరాటాలు, వర్తమాన పరిస్థితులు, దళితులుఈసడింపులు, సమ్మక్క సారక్క జాతర, బతుకమ్మ పండుగ, చేతివృత్తులు మాయమవడం, చెరువులు కుంటల దీనస్థితి, బ్రాహ్మణవాద ఆధిపత్యం, ఓట్ల రాజకీయాలు తదితర అంశాలు తిరుపతన్న మదిని తొలచగా కవితలుగా రూపుకట్టించారు.

తిరుపతన్న గ్రామీణ వాతావరణంలో పుట్టి పెరిగినాడు కనుక వీరికి కనిపించిన ప్రతి దృశ్యం కవితా వస్తువు అయింది. రచయిత ఊరిలోని జిలాల గుట్టను వర్ణిస్తూ "నిఖార్సయిన నల్లపూసల గుండ్లు/పల్లె తల్లికి ముత్తయిదువతనమిచ్చిన/ నల్లసరపుగుండ్లు" అని పల్లె ప్రక్కన ఉన్న గుట్ట రాళ్లను పల్లెతల్లి మెడలోని నల్లపూసల గుండ్లతో పోల్చడం కనిపిస్తుంది. శ్రావణ మాసంలో వంటలకు వెళ్లడం, రంగనాయకుల గుట్ట దొనలలో వండుకొని తినే విధానాన్ని ఇలా చెప్తాడు. "బండ సొరికెలెల్సిన రంగసామికి పబ్బతివడ్డరు/ సిన్నయ్య పెద్దయ్య గద్దెలు పుదిచ్చి/బెల్లపు శాకనారగించి బోనం చెల్లించేది." నానమ్మ లచ్చవ్వను యాది చేసుకుంట "ఆచారవంతురాలు" కవితలో పోశమ్మకు బోనం చేసేదని, శివాలు తూలుకుంట వేపాకులను పసపస నమిలేదని, కండ్లు పెద్దగ చేసి పండ్లను పటపట కొరికేదని చెప్పారు. ఈర గోలపట్టి చిన్న పోరగాండ్లను వెన్నుల చరిస్తే, పెయ్యిల భయం పోతుందనే నమ్మకం ఉండేదని కవి తన బాల్యాన్ని నెమరు వేసుకుంటున్నారు. ఇప్పటికీ ఆషాఢ మాసపు బోనాలు, శ్రావణ మాసపు వన భోజనాలు మన తెలంగాణ ప్రాంత ఆచార వ్యవహారాలుగా కొనసాగుతున్నాయి.

"తెలంగాణామ్మున గడ్డి పోచయును సంధించెన్ క్రుపాణమ్ము" అని దాశరథి తెలంగాణలో పుట్టిన ప్రతీది చేవకలిగినదని తెలంగాణ సాయుధ పోరాట కాలంలో చెప్పారు. ధిక్కారం, ఎదిరించే గుణం ఈ నేలలో పుట్టిన ప్రతి ప్రాణికి ఉందంటాడు. ఈ సందర్భంగా 2010లో జరిగిన ఒక సంఘటన గుర్తుకు వస్తున్నది. తెలంగాణ సకల జనుల సమ్మె




ఉధృతంగా నడుస్తున్న కాలమది. కూకట్ల తిరుపతి, నేను, రమణారెడ్డి, రాజన్న అప్రెంటీసు టీచర్లగానే కొనసాగుతున్నాము. ఇంకా మా సర్వీసు రెగులరైజేషన్ కాలేదు. స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో భాగంగా తిరుపతన్న నాయకత్వంలో మేము వీణవంక మండలంలో జరిగిన ధర్నా కార్యక్రమాలలో నిత్యం చురుకుగా పాల్గొన్నాము. అతను తెలంగాణ రచయితల వేదిక, తెలంగాణ జాగృతిలో కీలకంగా కొనసాగుతూ, తెలంగాణ ఉపాధ్యాయ ఐక్య కార్యాచరణ సమితిలోనూ కీలకంగా పని చేసేవారు. ఈ కార్యక్రమాలను ఇంటెలిజెన్స్ పోలీసులు రహస్యంగా వీడియో తీసి, ప్రభుత్వానికి పంపేవారు. తిరుపతన్న అప్రెంటిస్ టీచర్ అయి వుండి కూడా కేసులకు, అరెస్టులకు బెదరలేదు. సస్పెండ్ అయినా ఉద్యమాన్ని వీడేదిలేదనేవారు. ఇదీ ఈ కవికి ఉన్న కమిట్మెంట్. ఈయనతో కలిసి స్వరాష్ట్ర పోరులో పాల్గొనడం గొప్ప అనుభూతి. దీనిని ప్రత్యక్ష పోరాట సంఘటనగా చెప్పవచ్చు. ఇట్టి ఎదిరించే ధోరణి ఉంది కాబట్టే "హైదరాబాద్ సిర్ఫ్ హమారా" కవితలో

"హైదరాబాద్ నీ యబ్బ జాగీరు గాదు/ఇగ మీ నఖరాలు సాగయి బిడ్డా/అరిచి కీకలతో పెడబొబ్బలు వెట్టినా/మీ సెవులకినిపిత్త లేదా?/ ఛలో.. ముల్లెమూట సదురుకొని/ జెప్పన పిల్లజెల్లతో బైలెల్లుర్రి/ ఇంకా సోంచాయించితే..?/గండిమైసమ్మ కాడ గావుపడ్డం బిడ్డా!" అని గద్దర స్వరంతో హెచ్చరిస్తాడు.

"కొత్త కాంతి రేఖ" కవితలో 1969వ సంవత్సరం నుండి 2014 దాకా జరిగిన ఉద్యమ స్వరూపాన్ని కళ్లకు కట్టినట్టు కవి తనదైన శైలిలో ఈ రకంగా అభివ్యక్తీకరించారు.

"చాపకింద నీరై నిల్చిన/అహంకారపు ప్రతిరూపాలను/మంట్లె గలిపిన మిలీనియం మార్చ్/ అస్తిత్వ పునాదుల ఎన్కులాడిన టార్చ్/సాగరానికి హారం అవ్వడానికి/ఉసిల్ల పుట్ట పలిగినట్టు/ ఊళ్ళకూళ్ళు పువ్వులయి కదిలనయి" అని సాగర హారం, మిలీనియం మార్చ్ , సడక్ బంద్ వంటి కార్యక్రమాలు ఎలా ఉద్యమ వ్యాప్తిని చాటినాయో వివరించారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై సంవత్సరాలు గడిచినా, హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి ఇంకా పోవడంలేదు. అధికారులు ప్రతీనెల చివరి రోజు సివిల్ రైట్స్ డే జరుపుతారు. దళితకాలనీల్లో సహపంక్తి భోజనాలు పెడతారు. అయినా అక్కడి దుస్థితి మారుతలేదు. ఇవన్నీ గ్రహించిన కవి తిరుపతన్న "అయిదవవాన్నే నేను" అనే కవితలో పంచముడి దీనావస్థను సమాజంలో అతడి పాత్రను చిత్రించిన విధము శ్లాఘనీయం. "పీనుగుల పెనేసుకొన్న పీరితిని/బొక్కబోర్లేసే బొందును/ఎల్లెల్కల కాలేసే కాట్నంను/కొర్కాసుల మర్లేసే కాటి కాపరి నేనే/అవ్వవోల్లెవడ్డ కడగొట్టు పందును/నలుగురన్నల తోడ మొల్సిన/అయిదవ దాన్నే?నేను!" ఈ దేశ మూలవాసీనే నేనని ప్రకటించుకున్నారు. ఆర్యుల పెత్తనాలు ఇక చెల్లవని హెచ్చరిస్తారు. నీరటికాడు, తలారోడు, కైకిలోడు అని నీచంగా పిలుస్తారని బాధపడతారు. "ఊరికి ఆవల ఇసిరేసినట్టు/ తాటికమ్మల కప్పు/ఈతకమ్మల దడి" ఇదే తన ఆవాసమనీ, ఎవరికీ పట్టని బ్రతుకులు తమవని దీనగాథను ఎల్లవోసుకున్నారు. జాషువా గారు "గబ్బిలం"లో పంచముడి బ్రతుకు చిత్రాన్ని వర్ణించిన విధంగా ఈ" ఆరుద్ర పురుగు" కవితా సంపుటిలో కవి తిరుపతన్న వారి జీవన విధానాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు. అందుకే తిరుపతన్నను "అభినవ జాషువా"అని పిలువాలనిపిస్తోంది నాకీ సందర్భాన.

ఈ కవి గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెరిగినవాడు కాబట్టి వీరికి ప్రకృతితో విడదీయరాని అనుబంధం వుంది. పచ్చని పంట పొలాలు, చెట్లు, గుట్టలు, కాలువలతో మమేకమైన జీవితముంది. అందుకే నేమో సునిశిత దృష్టిని సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా వీరికి అపురూపమైన అందమైన జీవి ఆరుద్ర పురుగు కంటపడింది. మహాకవి శ్రీశ్రీ గారు "కుక్కపిల్ల, అగ్గి పుల్ల, సబ్బు బిళ్ళ కాదేదీ కవితకనర్హం" అన్నట్లు వీరు ఎంచుకున్న కవితా వస్తువు చిన్ని ఆరుద్ర పురుగు."పునాసకు పురుదు వోసినంక /పిలుద్దామన్న పలుకయి/కలుద్దామన్న కనబడయి/యిసప్పురుగు గాదాయే/యిపసారి పురుగు". అని ఈ ఆరుద్ర పురుగుల పుట్టుకను, జీవన క్రమాన్ని వెల్లడిస్తారు. ఇంత అద్భుతమైన చిరుజీవిపైన దృష్టి కేంద్రీకరించి, వీటిని వర్ణించి చెప్పిన ఏకైక కవి కూకట్ల తిరుపతన్న అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

తెలంగాణలో చెట్లను, పుట్టలను, పూలను, రాళ్లను దేవతల రూపంలో మొక్కడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. ఆడబిడ్డలు పెద్ద ఎత్తున సంబురంగ జరుపుకునే అతిపెద్ద పండుగ "బతుకమ్మ పండుగ". దీన్ని కవి "బతుకు పూల సొగడ"అనే కవితలో చక్కగా వివరించారు. "గుట్టంత చెట్టయి/గుమ్మంత గుబురుయిగుర్ల తంగేడు తుట్టెలు/చేరిగి పోసిన పస్పు రాశుల కల్లాలే!"అని ఎంతో మనోహరంగా వర్ణించాడు. తంగేడు, గునుగు, గుమ్మడి పూలు, గోరంటలు, చామంతులు, కట్లపూలతో బతుకమ్మని అందంగా పేర్చే తీరును కవిత్వీకరించాడు. దీంట్లో సత్తు ముద్దల కమ్మదనాన్ని ఇమిడ్చాడు.

ఇంకా ఈ సంపుటిలో వ్యవసాయం కునారిల్లిన తీరును వివరించారు. వ్యవసాయ భూములన్నీ సెజ్ ల రూపంలో, అపార్ట్ మెంట్లుగా రూపాంతరం చెందిన విధానాన్ని అభివృద్ధి అని చెప్పుకుంటున్నారని, ప్రపంచీకరణ పెడ ధోరణిని నిరసిస్తాడు. ఐదేండ్లకోసారి ఎన్నికల పేరిట నాయకులు చేసే మోసపు వాగ్దానాలను నమ్మవద్దని పిలుపునిచ్చారు. "నిరీక్షణ, నేను కలగంటున్న" అనే శీర్షికలతో కవి స్వరాష్ట్రం సిద్ధించాలనే కాంక్ష వెలిబుచ్చారు. స్వయాన ఉద్యమంలో పాల్గొన్న వ్యక్తి కాబట్టి రాబోయే తెలంగాణ రాష్ట్రాన్ని ఆనాడే ఎలా ఉండాలో స్వప్నించారు. ఈ కలలు ఎన్నటికైనా నిజం కావాలని కోరుకుందాం. ఇలా ఎన్ని పేజీలు రాసిన ఈ పుస్తకం గురించి ఒడిసేతట్టు లేదు. అయినా కొన్ని అంశాలను మాత్రమే స్పృశించడం జరిగింది. మొత్తంగా తిరుపతన్న కవిత్వం గురించి చెప్పాలంటే వీరు ఎక్కడ అణచివేత వున్న, ఆవేదన వున్న అక్కడ ప్రత్యక్షమవుతారు. మూలాలు వెతికి సమస్య సాధనకు నడుం బిగిస్తారు. న్యాయం కోసం ఎంతటి వారినైనా ఎదిరించడం, ధిక్కరించడడం వీరి నైజం. జన వ్యవహారంలో మాటలను కవిత్వీకరించి ఇవీ మన తెలంగాణా పదాలు, జాతీయాలు, సామెతలు,నానుడులు అని సగర్వంగా చెప్పే నిఖార్సయిన తెలంగాణకవి. బహుజన జాతి గర్వించదగ్గ రచయిత మన తిరుపతన్న. కాళోజీ గారన్నట్టు "బడి పలుకుల భాష కాదు. పలుకుబడుల భాష కావాలి" అని అనునిత్యం తన రచనల ద్వారా అణగారిన వర్గాలను మేల్కొలుపుతూ, మన తెలంగాణా భాషా వారసత్వాలను సజీవంగా విశ్వవ్యాప్తం చేస్తూ , భవిష్యత్తు తరాలకు అందజేయాలని పరితపిస్తున్న కవి కూకట్ల తిరుపతి గారు అభినందనీయులు. సొక్కం వంటి సక్కదనాల మన తెలంగాణ భాషలో మరిన్ని పుస్తకాలు వెలువరించాలని కోరుకుంటున్నాను. ఈ పుస్తకం కినిగె. కామ్ అంతర్జాలంలో సరసమైన ధరకు అందరికీ అందుబాటులో ఉంది.

**ప్రతులకు**
**కూకట్ల సాయి భారవి,**
**ఇ. నం: 129/1,**
**గ్రామం: మద్దికుంట,**
**మండలం: మానకొండూర్,**
**జిల్లా: కరీంనగర్. 505505.**
**తెలంగాణ రాష్ట్రం.**

**పుస్తక సమీక్షలు**
**సింగం సత్యనారాయణ**

## ప్రకృతి కావ్యం

పొడిపొడి నా హృదయం
తడితడి పొరల నాలుక సంభాషణ
నింగీనేల కలిసిన సహజ గానం

ఎండిన ప్రపంచం ఆకులు
నేల రాలే సమయంలో
ఓ పెద్ద గాలి విసురు
తోడుగా వాన జల్లు ముసురు ముసిముసిగా

తడిసిన ప్రేమ జవరాలు
వేడి దేహాన్ని తాకింది ప్రేమతో
ఒక అవ్యక్త అనిర్వచనీయ పరిమళం కురిసింది
మనసు దీరా
నాసిక ఉప్పొంగ ఓ మట్టి కవిత


చినుకుల తడికి నేల
పొడి రేణువుల ఉద్వేగ ఉద్రేక ఉత్సాహం
సహజ సందర సుగంధ సవాసన
ప్రకృతి ఎద చిలికిన కళాత్మ

అమ్మ మాటంత కమ్మగా
నాన్న నడకంత గొప్పగా
పాప కనుపాప చూడలేని దృశ్యం
శరీరం నిమిరిన చల్లని వాన చిరునామా

ముత్యాల కస్తూరి చెమట ఒళ్ళంతా
గాలి వీచిన వేసవి వాన నజరానా

తీవ్రఎండకు పేలాలుగా మాడిన మనిషి
సేదదీరే చెట్టు నీడ పొద
నిద్రలో రాత్రి నేల తనువు కల నిమ్మమైంది
ఉదయం తడిదారెంట మట్టివాసన పిల్ల
కాలువల

ఆనందగీతంలో
అద్భుత కలల సంగీతం
ప్రకృతిని మించిన సహజ కావ్యం మరెక్కడుంది!?
మట్టి పూసుకున్న వాసన విరిసే
ఘనీభవించని,ద్రవించని ప్రవాహ గాలి
ఆలాపనే.



**- డా.టి.రాధాకృష్ణమాచార్యులు**
**9849305871**

# డిగ్రీ కాలేజ్ – రైల్వే గేట్ రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలి

**: సిపిఎం నేత సత్రపల్లి సాంబశివరావు**



మణుగూరు, మహా : మణుగూరు పట్టణంలోని డిగ్రీ కాలేజ్ సమీపం నుంచి రైల్వే గేట్ వరకు సెంటర్ లైటింగ్‌తో కూడిన ఆధునిక రహదారి నిర్మాణానికి రూ.11 కోట్లు మంజూరైనప్పటికీ పనులు మధ్యలో నిలిచిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, స్థానిక ప్రజలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తున్నారని, పనులు అసంపూర్తిగా ఉండటంతో దుమ్ము, గుంతలు, ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో చేపట్టిన అభివృద్ధి పనులు ఇలా నిలిచిపోవడం బాధాకరమని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, నిలిచిపోయిన రహదారి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు కొడిశాల రాములు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు దామల వెంకన్న, సున్నం మల్లేష్, దొడ్డి నిర్మల, పల్లప్ నాగేశ్వరరావు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.




# మిడిదొడ్ల నాగేశ్వరావుకు ఘన నివాళి..

**సింగరేణి సోలార్ విద్యుత్ ప్లాంట్‌లో సంతాప సభ**

**మణుగూరు, మహా :** ఇటీవల మృతి చెందిన ఇఫ్టు జిల్లా ఉపాధ్యక్షులు, మణుగూరు నివాసి మిడిదొడ్ల నాగేశ్వరావు మృతికి సంతాపంగా ఆదివారం ఉదయం మణుగూరులోని సింగరేణి సోలార్ విద్యుత్ ప్లాంట్‌లో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మిడిదొడ్ల నాగేశ్వరావు లేని లోటు కాంట్రాక్ట్ కార్మిక వర్గానికి తీరనిదని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. నాగేశ్వరావు మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో సింగరేణి అనుబంధ సోలార్ విద్యుత్ ప్లాంట్ ప్రాంగణంలో జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాసర్ పాషా, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు చల్లా కాంతారావు, పోతురాజు వెంకట్రావు, శ్రీకాంత్, పోతురాజు శ్రీనివాస్, బత్తుల చంద్రశేఖర్, గోవింద శ్రీనివాస్, కూరపాటి సతీష్, మేకపోతుల కృష్ణ, లాల్ మహమ్మద్, దేవేందర్ తదితరులు పాల్గొని నాగేశ్వరావుకు ఘనంగా నివాళులర్పించారు.




# సోంపల్లి ఇసుక ర్యాంపు వద్ద ఉద్రిక్తత.. లారీ ఢీకొని బ్లూ కోల్ట్ సిబ్బందికి గాయాలు

**బూర్గంపాడు,మహా :** సోంపల్లి ఇసుక ర్యాంపు వద్ద గ్రామస్తులు లారీల రాకపోకలను అడ్డుకుంటున్నారనే సమాచారంతో సంఘటనా స్థలానికి వెళ్లిన బ్లూ కోల్ట్ పోలీసు సిబ్బంది విధులు నిర్వహించి తిరిగి వస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు పోలీసు సిబ్బందికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం, సోంపల్లి గ్రామస్తులు ఇసుక లారీలను అడ్డుకుంటున్నారని సమాచారం అందడంతో బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌కు చెందిన బ్లూ కోల్ట్ సిబ్బంది కానిస్టేబుల్ మంగీలాల్, హోంగార్డ్ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్ది, లారీలను పంపించిన అనంతరం తిరిగి బయలుదేరారు. ఈ క్రమంలో దోమలవాగు ప్రాంతం నుంచి బయటకు వస్తుండగా, AP16TJ 3569 నంబరు గల లారీ డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ ముందుగా వెళ్తున్న బ్లూ కోల్ట్ సిబ్బంది ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ మంగీలాల్, హోంగార్డ్ శ్రీనివాసరావులకు గాయాలయ్యాయి. ప్రమాదం కారణంగా బైక్‌తో పాటు విధుల్లో ఉపయోగిస్తున్న రెండు ట్యాబ్‌లు కూడా ధ్వంసమయ్యాయి. గాయపడిన సిబ్బందికి చికిత్స అందించగా, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై బూర్గంపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించాడా, ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# సింగరేణిలో కాళీ పోస్టుల భర్తీకి వ్రాత పరీక్ష

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి కాలరీస్ కంపెనీలో ఖాళీగా ఉన్న జూనియర్ కెమిస్ట్ జూనియర్ టెక్నికల్ ఇన్స్పెక్టర్ టి అండ్ ఎస్ గ్రేడ్ డి పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేసే దానిలో భాగంగా ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ పిజి జూనియర్ కళాశాలలో వ్రాత పరీక్ష నిర్వహించటం జరిగింది. పరీక్ష తీరును సింగరేణి జిఎం(పర్సనల్) ఈఈ అండ్ ఆర్‌సి ఏ.జే.ఎం మురళీధరరావు, ఏజిఎం(విజిలెన్స్)ఎస్.వి.మురళీధర రాజు పర్యవేక్షించి పరీక్ష పూర్తిగా మెరిట్ పై ఆధారపడి ఉంటుందని దళారులకు ఎలాంటి ప్రమేయం ఉండదని వారిని నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు. ఈ పరీక్ష ఫలితాలు సింగరేణి వెబ్ సైట్, సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం వద్ద నోటీస్ బోర్డుద్వారా తెలియజేయటం జరుగుతుందని తెలియజేశారు.

ఈ పరీక్ష నిర్వహణ పరిశీలనలో డిజిఎం(పర్సనల్) పి.వేణు గోపాలరావు, పర్సనల్ మేనేజర్ బి.సమ్మయ్య డివై.పిఎంలు డి.నాగేశ్వర రావు, కే.సంతోష్‌కుమార్, విజిలెన్స్ ఆఫీసర్స్ ఎస్‌డి.షాకిర్ మొహినుద్దీన్, ఎండి.హషిం పాషా, సింగరేణి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి.సంధ్యా రాణి, డిగ్రీ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.మంజుల ఇతర అధికారులు, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ సిబ్బంది రిక్రూట్మెంట్ ఉద్యోగులు పాల్గొన్నారు.







# మందమర్రిలో ప్రకృతి బీభత్సం

- **ఈదురుగాలులు, వర్షా నికి విద్యుత్తు స్తంభాలు విరిగిపోయాయి**
- **నష్టపోయిన వాయితులను ఆదుకుంటాం--కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద హామీ**

**మందమర్రి, మహా :** శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షం మందమర్రి మండల పరిసర ప్రాంతాలను అతలాకుతలం చేసింది. గంటకు 6070 కి.మీ వేగంతో వీచిన ఈదురుగాలులకు విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి, భారీ వృక్షాలు కూలిపోయి రోడ్లు మూసుకుపోయాయి. ప్రజా జీవనం అస్తవ్యస్తమైంది. కార్మిక కాలనీల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కూలిన చెట్లు రోడ్లపై పడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సింగరేణి కాలనీల్లో పరిస్థితి గమనించిన సింగరేణి కంపెనీ ఏరియా జిఎం రాధాకృష్ణ తాత్కాలిక పనులకు సిబ్బందిని పురమాయించారు. వెంటనే అందించిన సిబ్బంది రాత్రంతా కష్టపడి చెట్లను తొలగించే పనులు చేపట్టారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి ఆదివారం తెల్లవారుజామున కొన్ని బస్తీలకు కొంతమేర విద్యుత్తును పునరుద్ధరించారు. విద్యుత్తు శాఖ సిబ్బంది కూడా క్షేత్రస్థాయిలో పనిచేసి కొత్త స్తంభాలు నిలబెట్టే పనిలో నిమగ్నమయ్యారు.

**రేకుల ఇళ్లు నేలమట్టం - నష్టం అంచనా కొనసాగింపు**

బలమైన గాలులకు పేద కుటుంబాల రేకుల ఇళ్లు కూలిపోయాయి. రేకులు ఎగిరిపోయి ఇళ్లు వాన నీటితో నిండిపోయాయి. ఇప్పటివరకు ఎన్ని నివాస గృహాలు పూర్తిగా కూలిపోయాయో అధికారిక లెక్కలు తెలియరాలేదు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు నష్టం అంచనా వేసే పనిలో ఉన్నారు. పూర్తి వివరాలు వచ్చిన తర్వాతే పరిహారం ప్రక్రియ మొదలవుతుంది.

**మంత్రి, ఎంపీ పరామర్శ - ఆదుకుంటామని హామీ**

ప్రకృతి వైపరీత్యం వార్త తెలియగానే రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ మందమర్రికి చేరుకున్నారు. విరిగిపోయిన విద్యుత్తు స్తంభాలు, కూలిన చెట్లు, కొట్టుకుపోయిన రేకుల ఇళ్ల యజమానులను స్వయంగా పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుంది. నష్టపోయిన ప్రతి నిరుపేద కుటుంబానికి తక్షణ సహాయం అందిస్తాం. విద్యుత్తు, రహదారుల పునరుద్ధరణకు అధికారులను ఆదేశించామని మంత్రి వివేకానంద హామీ ఇచ్చారు.



# కారేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా తోటకూరి రాంబాబు

**కారేపల్లి, మహా:** కారేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా తోటకూరి రాంబాబు నియమితులైనారు. డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ ప్రతిపాదనలు అనుసరించి టిపిసిసి అధ్యక్షులు బి మహేష్ కుమార్ గౌడ్ నియామక ఉత్తర్వులు వెలువరించారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్ అనారోగ్య కారణాలు, సామాజిక సమీకరణాల మూలంగా విశ్వనాథపల్లికి చెందిన తోటకూరి రాంబాబు ను మండల కాంగ్రెస్ పదవి వరించింది. తనపై నమ్మకంతో కారేపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించిన వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాస్ నాయక్, డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ , టీపీసీసీ అధ్యక్షులు బి మహేష్ కుమార్ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా అందరి సహకారంతో మండలంలో పార్టీ అభివృద్ధికి, ప్రభుత్వ పథకాలను ప్రజల ముందు ఉంచనున్నట్లు రాంబాబు తెలిపారు. నూతన కాంగ్రెస్ అధ్యక్షులు ఎన్నికైన రాంబాబు ను ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజావాణి లక్ష్యం

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



వరంగల్ మహా;వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమంనిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటన ద్వారా తెలిపారు.రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా పరిధిలో జిల్లా స్థాయి, రెవెన్యూ డివిజన్ పరిధిలో రెవెన్యూ స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రజావాణికి జిల్లా స్థాయి సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయి ప్రజావాణి కి, డివిజన్ స్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయి అధికారులు హాజరై వారి సమస్యల పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఆవకాశాన్ని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటన ద్వారా తెలిపారు.

# పదిలో ప్రతిభ చూపిన విద్యార్థినికి సర్పంచ్ సాయం

**సన్మానించిన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్**



**కారేపల్లి, మహా :** పదోవ తరగతి పబ్లిక్ పరీక్ష లలో ప్రతిభ చూపిన విద్యార్థిని ఆర్థిక పరిస్థితి కి చలించిన సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్ (టోనీ) రూ. 10వేల ఆర్థిక సాయం అందించారు. ఆదివారం కారేపల్లి లోని మోడల్ స్కూల్ లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభకు పురస్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కారేపల్లి మండలం గాదెపాడు కు చెందిన మమత కోమట్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివి 548 మార్కులు సాధించింది. మమత ను సన్మానిస్తున్న సందర్భంగా తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి, తన తండ్రి యనమగండ్ల శ్రీనివాస్ గురించి వివరిస్తుండగా భావోద్వేగానికి గురైంది. తండ్రి శ్రీనివాస్ మాట్లాడుతూ గాదెపాడు గ్రామంలోఎదురు కరలతో తట్టలు, బుట్టలు. అల్లుకొని జీవిస్తున్నామని, ఇటీవల ప్లాస్టిక్ వాడకం ఎక్కువ కావడంతో, తమ బుట్టలు తట్టలు గిరాకీ పడిపోయిందని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశాడు.తన ఆర్థిక పరిస్థితి బాగాలేదని.. తనకు ఇద్దరు కుమార్తెలని వారి ఉన్నతి కోసం తాపత్రయ పడుతున్నట్లు కన్నీరు పెట్టుకున్నాడు. మమత కుటుంబ పరిస్థితి కి చలించిన సర్పంచ్ టోనీ వెంటనే రూ. 10వేలు ఆర్థిక సాయం చేశారు. చదువు కు పేదరికం అడ్డుకాదని, లక్ష్యం కోసం కష్టపడి చదవాలని సర్పంచ్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, ఫౌండేషన్ ప్రతినిధులు భూక్య కర్ణ, ముత్తబోయిన శ్రీనివాస్ దస్తగిరి, వీరస్వామి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల కుదింపు ఆలోచనలు విరమించుకోవాలి

- **ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి**
- **పి ఆర్ సిని వెంటనే ప్రకటించాలి**
- **లేకుంటే ప్రతిఘటన తప్పదు**
- **టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్**




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** పి ఆర్ సిని వెంటనే ప్రకటించాలని లేకుంటే ఉద్యమం తప్పదని అంతేకాకుండా పాఠశాలల కుదింపు ఆలోచనలు విరమించుకోవాలని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెంలోని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యాలయం టీచర్స్ భవన్ నందు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టిఎస్ యుటిఎఫ్) జిల్లా విస్తృత కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు బి.మురళీమోహన్ అధ్యక్షతనజరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వం 27,000 ప్రభుత్వ పాఠశాలలను 4000 పాఠశాలలుగా కుదించాలనే ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధంగా తగుచర్యలు తీసుకోవాలని మొదటి దశలో ప్రతి గ్రామ పంచాయతీలో ఒక పాఠశాలను ఆదర్శ పాఠశాలగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. నర్సరీ కేజీ తరగతులను ప్రవేశపెట్టి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంచడం కొరకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే పాఠ్యపుస్తకాలు వర్క్ బుక్కులు నోటు పుస్తకాలు యూనిఫామ్స్ పాఠశాలలకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయాలని పర్యవేక్షణ పోస్టులను వెంటనే భర్తీ చేయుటకు సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బడులను అభివృద్ధి చేయాలని నూతన ఆవాసాలు పెరిగినందున పాఠశాలలను ప్రారంభించాలని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం ద్వారా మాత్రమే సమాజంలో అంతరాలు తొలగిపోతాయని అన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత ఉందని ఉపాధ్యాయుల అసమతుల్యత ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ లేకపోవడం లోపాలు వీటిని సరిదిద్దేందుకు కృషి చేయకపోవడం శోచనీయమన్నారు. 15 శాతం బడ్జెట్ కేటాయిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడవ విడత బడ్జెట్ లో కూడా 8.22 శాతం దాటలేదన్నారు. యంగ్ ఇండియా టిపిఎస్ పేరుతో జనాకర్షక పాఠశాలలు కాకుండా ప్రజలందరికీ అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా ఆఫీస్ బేరర్లు ఎం.రాజయ్య, ఎస్.వెంకటేశ్వర్లు, హథీరాం, తావుర్య, రాము, పద్మారాణి, ఆర్.రమేశ్ కుమార్, గంగాధర్, డి.దాసు, ఎం.సత్యనారాయణ, షేక్ పాషా, మంగీలాల్, సత్యశ్రీ, జానకి, జయాబయి, యశోద, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.కిషోర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే పాయంను కలిసిన డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరరావు

**మణుగూరు, మహా :** ఇటీవల సివిల్ సప్లై శాఖలో డిప్యూటీ తహసీల్దార్‌గా మణుగూరుకు బదిలీపై వచ్చిన మైపతి రాజేశ్వరరావు ఆదివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన కొత్త బాధ్యతల స్వీకరణ అనంతరం శాఖ పనితీరు, ప్రజలకు అందించాల్సిన సేవలపై ఎమ్మెల్యేతో చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మైపతి రాజేశ్వరరావు మాట్లాడుతూ, మణుగూరు ప్రాంత ప్రజలకు సివిల్ సప్లై శాఖ ద్వారా మరింత మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తానని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రభుత్వ అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా సివిల్ సప్లై శాఖ ద్వారా అందించే సేవలు వేగవంతంగా, పారదర్శకంగా ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది, సివిల్ సప్లై శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గోదారమ్మ క్యాంపులో వీధి కుక్కల సైరవిహారం

**మహిళలు, వృద్ధులు, చిన్నారులపై దాడులు.. ప్రజల్లో ఆందోళన**

**బూర్గంపహాడ్, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని గోదారమ్మ క్యాంపులో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. గ్రామంలోని వీధుల్లో కుక్కలు స్వేచ్ఛగా సంచరిస్తూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చేతిలో ఆహార పదార్థాలు లేదా కవర్లు పట్టుకుని బయటకు వెళ్లే వారిపై కుక్కలు ఎగబడుతున్నాయని, వాటిని తరిమే ప్రయత్నం చేస్తే దాడి చేసి కరుస్తున్నాయని చెబుతున్నారు. గోదారమ్మ క్యాంపులో గత వారం రోజుల వ్యవధిలోనే నలుగురు వ్యక్తులను వీధి కుక్కలు కరవగా, తాజాగా ఆదివారం ఒక మహిళపై కూడా దాడి చేసి గాయపరిచినట్లు స్థానికులు తెలిపారు. దీంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. గ్రామపంచాయతీ పరిధిలో వీధి కుక్కల సమస్యపై ఇప్పటికే గ్రామసభలో చర్చించి తీర్మానం చేసినప్పటికీ ఇప్పటివరకు సమర్థవంతమైన చర్యలు కనిపించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వీధి కుక్కలను గ్రామ పరిధి నుంచి తరలించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ప్రాణహాని జరగకముందే సంబంధిత అధికారులు, పంచాయతీ పాలక వర్గం తక్షణ చర్యలు తీసుకోవాలని గోదారమ్మ క్యాంపు ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో పెరుగుతున్న వీధి కుక్కల బెడదపై అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.




# రక్తదానం చేద్దాం ప్రాణాలను కాపాడుదాం

**కోడి మాల శ్రీనివాసరావు**

**మహా వరంగల్ బ్యూరో :** ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా యూత్ ఫర్ సొసైటీ వ్యవస్థాపకులు కొడిమాల శ్రీనివాసరావు (ఓవిఈ 48 సార్లు రక్తదాత) ఆధ్వర్యంలో ప్రముఖ చారిత్రాత్మక దేవాలయం వేయి స్తంభాల గుడి ప్రాంగణంలో రక్త దాన అపోల పై ప్రజలకు , భక్తులకు ,టూరిస్టులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి కోడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ రక్తదానం అనేది అన్ని దానాల కన్నా గొప్పదైనదని దీని ద్వారా ప్రత్యక్షంగా ముగ్గురి ప్రాణాలను కాపాడచ్చని ప్రతి రక్తదానం మానవత్వంని ప్రధానంగా విలువలను తెలుపుతుందని, రక్తదానం కేవలం ఒక వైద్యపరమైన చర్య మాత్రమే కాదని ,ఇది సంఘీభావము ,కరుణ, మానవత్వం సామాజిక బాధ్యతకు నిదర్శనమని (18 సం నుండి 60 సంవత్సరాల వరకు) ఆరోగ్యవంతులైన ,అర్హులైన ప్రతి ఒక్కరూ సంవత్సరానికి నాలుగు సార్లు రక్తదానం చేయొచ్చని రక్తదానంతో బలహీనమైతమని కొంతమంది ఒక అభిప్రాయమని ఇది కేవలం ఒక అపోహ మాత్రమే అని రక్తదానం వల్ల మనలో నూతన రక్తకణాలు ఏర్పడి ఉత్తేజంతో, ఆరోగ్యంగా మరియు మానసికంగా ఉత్సాహంగా ఉంటామని ముఖ్యంగా యువత ముందుకు వచ్చి రక్తదానం చేసి ఆపదలో ఉన్న వ్యక్తుల ప్రాణాలను కాపాడి తాము కూడా ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ సొసైటీ బాధ్యులు దేవిశ్రీప్రసాద్ ,సాకేత్ ,రక్షిత్ ,రిత్విక్, సంజన, సాయి రమేష్, మాస్టర్ అర్జున్ కార్తికేయ, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.



# పాలకుల నిర్లక్ష్యంతో అంధకారంలో యువత భవిష్యత్తు

**కారేపల్లిలో ఘనంగా చేగువేరా జయంతి**

కారేపల్లి, మహా: విద్యా, ఉపాధి, అవకాశాలు కల్పించకుండా పాలకులు నిర్లక్ష్యం వహిస్తూ యువత భవిష్యత్తు ను అంధకారంలోకి నేడుతున్నారని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఆదెర్ల వినయ్ కుమార్ అన్నారు. ప్రపంచ యూత్ ఐకాన్, విప్లవకారుడు, మార్క్సిస్టు మహోపాధ్యాయుడు చేగువేరా 98వ జయంతిని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కారేపల్లి లోని భాగం రామ నరసయ్య భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదెర్ల వినయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం పేపర్ లీకేజీల పేరుతో నిరుద్యోగాన్ని పెంచుతూ ఉద్యోగ కల్పన ను ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ దేశ భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందన్నారు. దేశంలో యువత చేగువేరా స్ఫూర్తితో కుల మత ప్రాంత విభేదం మరిచి సమస్యల పరిష్కారం ఐక్యతతో పోరాడాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు ఉన్నప్పుడు పెరగని అయిల్ ధరలు ఎన్నికలు అయిపోగానే ఎందుకు పెరుగుతున్నాయని ప్రశ్నించారు. పాలకులు చెబుతున్న సాకులు ప్రజలను మోసం చేయడమేనన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ బాటలోనే సీఎం రేవంత్ రెడ్డి నడుస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నారన్నారు. ఆరు గ్యారంటీలు, రెండు లక్షల ఉద్యోగాలులు హామీలుగానే మిగిలాయని తెలిపారు. సమస్యలపై నిరంతరం పోరాడటమే చేగువేరాకు ఇచ్చే నిజమైన నివాళి అని వినయ్ అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు గాదె నరేష్, తాళ్లూరి రాజా, కాకాటి పృధ్వి, తులసి మొగ్గ జీవన్, యర్నాగి సంపత్, ఉపెల్లి అఖిల్, మూడు వంశీ తదితరులు పాల్గొన్నారు.



# అగ్ని ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే నాయిని

- బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చిన నాయిని
- బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచన

**హన్మకొండ మహా ;** వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శనివారం రాత్రి ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో దగ్ధమైన సమ్మయ్య నగర్‌కు చెందిన రెండ్ల శ్రీనివాస్ పాత పుస్తకాల గోదాంను పరిశీలించారు.ఈ సందర్భంగా ఘటన జరిగిన తీరును బాధితుడు రెండ్ల శ్రీనివాస్ ను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, అగ్నిప్రమాదానికి దారి తీసిన పరిస్థితుల పై ఆరా తీశారు. అనంతరం సంఘటనకు బాధ్యులైన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఫోన్ ద్వారా సూచించారు. ప్రమాదం కారణంగా జరిగిన ఆస్తి నష్టం పై సంబంధిత అధికారులతో విచారణ జరిపించి, ప్రభుత్వ పరంగా అందించగల సహాయక చర్యలను బాధిత కుటుంబానికి అందించేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే నాయిని, ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల తరఫున అవసరమైన సహకారం అందిస్తామని భరోసా కల్పించారు.స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే గారితో పాల్గొన్నారు.



# తలసేమియా చిన్నారుల కోసం రక్తదానం

**యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్**

**మహా వరంగల్ బ్యూరో:** యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా తలసేమియా చిన్నారుల కోసం రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్, హనుమకొండ లో రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు.

యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారు హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో జూన్ 14 వ తేదీ , 2026 ఆదివారం తలసేమియా బాధితులను కాపాడేందుకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథులుగా రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణు గోపాల్, పోట్లపెల్లి శ్రీనివాస్ రావు, శ్రీరామ్ కళ్యాణ్ (మ్యుజిషన్), సామిజికవేత్త నిమ్మల శ్రీనివాస్ విచ్చేసి ప్రారంభించి రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సంధర్భంగా అతిథులు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానం తో సమానమని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు తమ రక్తాన్ని దానం చేసిన రక్తదాతలను అబినందించినారు.

తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్, వరంగల్




పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), గుల్లెపెల్లి శివ కుమార్ ఆర్గనైజర్లను, రక్తదాతలను రెడ్ క్రాస్ పాలకవర్గం పక్షమున అబినందించారు.

ఈ రక్తదాన శిబిరం లోహనుమకొండ రెడ్ క్రాస్ జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, రెడ్ క్రాస్ డాక్టర్ జి. డా. జి. కిషన్ రావు, దేవునూరి ఆనంద్, రక్తదాత లోకేష్, హెచ్. డి.ఎఫ్.సి బ్యాంకు సిబ్బంది : ప్రదీప్ శర్మ, శివ కృష్ణ, శంకర్, చిలువేరు శంకర్, యువ నేతాజీ ఫౌండేషన్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), గుల్లెపెల్లి శివ కుమార్ (రెడ్ క్రాస్), పోలీస్ కానిస్టేబుల్ బొట్టు కమలాకర్, ఉప్పరపల్లి రాజ్ కుమార్,ఊరటి రవి కుమార్, అలువాల పృద్వి, యాద రవి కుమార్, పల్లె రాజిరెడ్డి, రాకేష్, భావన, సునీత, నరేష్, నవీన్, రవి కుమార్, రెడ్ క్రాస్ సిబ్బంది రవీందర్, చరణ్, వినయ్, పోశాలు తో పాటు ఈ రక్తదాన శిబిరంలో దాదాపు 51 మంది రక్త దాతలు పాల్గొన్నారు.

# నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అభివృద్ధి మాత్రం శూన్యం

**బస్తీ సమస్యలపై గలమెత్తిన...**
**డివిజన్ అధ్యక్షులు స్, వెంకటేష్,**

**రాజేంద్రనగర్ మహా :** కాటేదాన్ డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్ లోబిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్,గుమ్మడి కుమార్, బిఆర్ఎస్ యువ నాయకులు ఆదివారం బస్తి సమస్యలపై స్థానికులతో కలిసి పర్యటించారు. సబితా ఇంద్రారెడ్డి చేసిన అభివృద్ధి తప్ప ఎమ్మెల్యేగా ప్రకాష్ గౌడ్ బస్తీలకు చేసింది ఏమీ లేదు అన్నారు. గత 16 సంవత్సరాలుగా సాయిబాబా నగర్ లో ఎలాంటి అభివృద్ధి నోచుకోలేదన్నారు. సిసి రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి సమస్య పై స్థానికులు బిఆర్ఎస్ నాయకులు ఎస్ వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బిఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేయాలన్నారు. అడుగడుగునా సమస్యలతో ప్రజలు వారి ఆవేదన తెలిపారు. సాయిబాబా నగర్ లో అడుగడుగునా జలమండలి అధికారుల జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యం అలసత్వం కళ్ళకు కట్టినట్టు కనిపించింది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎళ్ల నాటి శివరెజ్ లైన్లు



నిండి రోడ్డు మధ్యలో మురికి నీరు ఏరులై పారుతున్న దృశ్యాలు చూసి ప్రజలు ఏరి కోరి తెచ్చుకున్న ప్రజా పాలన ఇదేనా అని ఏద్దెవా చేశారు. గతంలో ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకున్న దాఖలాలు లేవు అన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి వెంటనే వీధి దీపాలు మరమ్మత్తు చేసి ఓపెన్ నాలాలోని మట్టిని తొలగించి ఏళ్ల నాటి శివరెజ్ లైన్లు తొలగించి దాని స్థానంలో అక్కడికి సరిపడా శివరెజ్ లైన్లు వేయగలరని ఉన్నత అధికారులను విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి కోసం పార్టీ మారిన అని చెప్పుకోవడం తప్ప అభివృద్ధి ఎక్కడ జరగలేదని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పై మండిపడ్డారు. ఎమ్మెల్యే ఈ సమస్యలపై దృష్టి సారించి యుద్ధ ప్రతిపాదికన సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాము యాదవ్, రాఘవేందర్ యాదవ్, జగదీష్, ప్రవీణ్, ఉప్పల్ శ్రీను, సరిత మహేష్, రామస్వామి, శ్రీను, నరేష్, ఆనంద్, బాల్ రాజ్, అశోక్, దిలిప్ శేఖర్, రాజు, మోహన్ బొంబాయిరవి, వెంకటరమణ, సురి,అనిల్, శ్రీకాంత్ చారి, నాని, అఖిల్, సింహాచలం, రాము కృష్ణ పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు కాపాడుకోవటమే లక్ష్యం

- కాంగ్రెస్ శ్రేణులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పిలుపు...
- ఎస్ఐఆర్ పట్ల క్షేత్రస్థాయిలో సమన్వయంతో సాగాలని సూచన...
- బొంగ్లూర్ లో నియోజకవర్గ కాంగ్రెస్ బీఎల్ఏలకు శిక్షణా కార్యక్రమం...
- హాజరైన ఎంపీ చామల, పీసీసీ ట్రైనింగ్ కమిటీ ఛైర్మన్ రామ్మోహన్ రెడ్డి...



**ఇబ్రహీంపట్నం జూన్ 14 మహా :** రాష్ట్రంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) వేళ నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ ఒక్కరి ఓటునూ కాపాడుకోవటమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన బూత్ లెవెల్ ఏజెంట్స్ కు శిక్షణా కార్యక్రమాన్ని బొంగ్లూర్ గేటు వద్ద ప్రమిదా గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, పీసీసీ ట్రైనింగ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియతో కాంగ్రెస్ ఓట్లు పెద్ద ఎత్తున తొలగించబడినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం వహిస్తే... పార్టీకి నష్టం చేకూర్చే ప్రమాదం ఉందని చెప్పారు. బీఎల్ఓలతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో సాగుతూ.... ఒక్క ఓటు కూడా వృథా అవ్వకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉంటుందని చెప్పారు. అనంతరం, ఎంపీ చామల మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీపై జరిగే కుట్రలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను సేకరించే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా యాక్టివ్‌గా ఉండి, ప్రతి ఇంటినీ సందర్శించాల్సిన అవసరం ఉందన్నారు. ట్రైనింగ్ కమిటీ ఛైర్మన్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.... ఓటరు జాబితా ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించడంలో బీఎల్ఏల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. ఎలాంటి పొరపాటు గమనించినా వెంటనే గుర్తించాలని చెప్పారు. అభ్యంతరాలపై అప్పీల్ కు వెళ్లే అవకాశం ఉన్నందున, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. నియోజకవర్గ బీఎల్ఓల శిక్షకుడు చైతన్య కృష్ణారెడ్డి... ఓటరు జాబితా పరిశీలన, సవరణల ప్రక్రియ, ఇంటింటికి నిర్వహించాల్సిన కార్యక్రమాలు, ప్రజలతో సమన్వయం వంటి అంశాలపై వివరంగా చనలు అందజేశారు. ఈ శిక్షణా కార్యక్రమానికి నియోజకవర్గంలోని కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్స్, పార్టీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# భూమి చిస్తూ తెస్తే కాంగ్రెస్ కు పుట్టగతులు ఉండవు

- మల్లీ పటేల్, పట్వారి వ్యవస్థకు జీవంపోస్తే సహించం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్

**యాదాద్రి భువనగిరి జూన్ 14 మహా :** భూమి చిస్తూ తెస్తే కాంగ్రెస్ కు ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవుని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి. జహంగీర్ హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్రంలో మల్లీ పటేల్, పట్వారి వ్యవస్థకు జీవంపోస్తే సహించే లేదని అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి సీపీఎం మండల కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో జహంగీర్ పాల్గొని ప్రసంగించారు ఆనాడు కమ్యూనిస్టులు, పేద రైతాంగం, ప్రజలందరూ కలిసి పోరాడిన ఫలితంగా 1984 జనవరి 6న పటేల్, పట్వారి వ్యవస్థను మరియు భూమి చేస్తున్న ఎన్టీరామారావు రద్దు చేశారని తెలిపారు. వక్రబుద్ధి కలిగిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ పాత విధానాన్ని తీసుకురావడానికి కసరత్తు చేస్తున్నట్లు స్వయంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల ఖమ్మం పర్యటనలో బయటపెట్టాడని అన్నారు. దీనితో రైతుల్లో ఆందోళన కలిగిస్తుందని తెలిపారు. నాలుగు దశాబ్దాల తర్వాత




కాంగ్రెస్ ప్రభుత్వం భూమికి రకం వసూలు చేస్తానని ప్రకటించడం సీపీఎం పార్టీగా తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఆనాడు భూమిశిస్తూ చెల్లించని రైతులపై రెవెన్యూ సిబ్బంది దౌర్జన్యం చేసి పేద, మధ్య తరగతి పెద్ద రైతులతో సహా ఇబ్బందులు పెట్టి పరువు తీసిన స్థితిని మళ్లీ రానీయకుండా ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రైతుల నుండి ఏదోరకంగా పన్నులు వసూలు చేసి తమ ప్రభుత్వ ఖజానా నింపుకోవాలనే ఆలోచన సరైనది కాదని ఎట్టి నిర్ణయాన్ని వెంటనే విరమించుకోకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని జహంగీర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా, మాజీ డివిజన్ కార్యదర్శి గూడూరు అంజిరెడ్డి, మండల కార్యదర్శి కోట రామ చంద్రారెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్ తదితరులు పాల్గొన్నారు.



# జొన్నల కొనుగోళ్లలో రికార్డు

- 73 వేల మెట్రిక్ టన్నుల జొన్నల సేకరణ
- రైతులకు 270 కోట్లకు పైగా చెల్లింపులు
- వెల్లడించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ మహా :** జిల్లాలో రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ జొన్నల కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించిన ఫలితంగా ఈ యాసంగి సీజన్‌లో జొన్నల కొనుగోళ్లు రికార్డు స్థాయికి చేరుకున్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు.రైతులు పండించిన జొన్నలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, పంట విక్రయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. గత యాసంగి సీజన్‌లో జిల్లాలో 16 కొనుగోలు కేంద్రాలు ఉండగా, ఈ ఏడాది వాటి సంఖ్యను 26కు పెంచినట్లు తెలిపారు. దీంతో రైతులు తమ సమీప ప్రాంతాల్లోనే పంటను విక్రయించుకునే అవకాశం లభించిందన్నారు.గత యాసంగి2025లో జిల్లాలోని 16 కొనుగోలు కేంద్రాల ద్వారా 56,017 మెట్రిక్ టన్నుల జొన్నలను సేకరించగా, యాసంగి2026లో 26 కొనుగోలు కేంద్రాల ద్వారా 73,094 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే గత ఏడాది 56,017 మెట్రిక్ టన్నుల జొన్నలను రవాణా చేయగా, ఈ ఏడాది 67,222 మెట్రిక్ టన్నుల జొన్నలను రవాణా చేసినట్లు తెలిపారు.జొన్నల కొనుగోళ్ల కోసం గత ఏడాది రూ.188.83 కోట్లను రైతులకు చెల్లించగా, ఈ ఏడాది రైతులకు రూ.270.37 కోట్ల మేర చెల్లింపులు జరగనున్నట్లు వెల్లడించారు. రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, రైతుల ఆర్థికాభివృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.జొన్నల కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, పౌర సరఫరాల శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతు సంఘాలు, రైతులకు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు.



# నేటి నుండి అందుబాటులో యూరియా యాప్

**కారేపల్లి, మహా :** రైతులకు యూరియా కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఫెర్టిలైజర్ తీసుక వచ్చిందని మండల వ్యవసాయ అధికారి బట్టు అశోక్ కుమార్ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ యూరియా అమ్మకాలు యాప్ ద్వారానే జరగనున్నాయన్నారు. కారేపల్లి మండలంలో సొసైటీ ఆధ్వర్యంలోని కారేపల్లి, గాంధీనగర్, ఎర్రబోడు, సీతారాంపురం, మాదారం అన్ని స్టాక్ పాయింట్లలో 55 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. సోమవారం నుండి యూరియా యాప్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. యూరియాకు ఎలాంటి కొరత లేదని ముందస్తుగా యూరియా నిలవ చేయడం వల్ల నత్రజని గాలిలో కలిసి యూరియా తో ఆశించిన ఫలితం లభించదన్నారు. అవకాశం ఉందన్నారు. అధిక యూరియా వాడకంతో అధిక చీడపీడలు ఆశించి దిగుబడి తగ్గటం. నాణ్యత లోపించటం జరుగుతుందన్నారు. నానో యూరియా తో తక్కువ ఖర్చు అధిక ఫలితం ఉంటుందన్నారు.

# ఇంధన కొరతపై కేంద్ర మంత్రి క్లారిటీ!



దేశంలో ఎలాంటి ఇంధన కొరత లేదని, ముడిచమురు, ఎల్‌జీ, సహజ వాయువు సరఫరా పరిస్థితి చాలా ఆశాజనకంగా ఉందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి శనివారం స్పష్టం చేశారు. దేశీయంగా 60 రోజులకు పైగా సరిపడా ముడిచమురు, సహజ వాయువు నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా కూడా చాలా మెరుగ్గా ఉందన్నారు. గరిష్ఠంగా 75 నుంచి 80 రోజులకు సరిపోయేలా నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.ఎల్‌పీజీ కనెక్షన్ దారులు క్రమంగా పైప్డ్ గ్యాస్ (పీఎన్‌జీ) వైపు మారాలని ఆయన కోరారు. ఇక డీజిల్ విక్రయాలపై రోజుకు 200 లీటర్ల పరిమితి విధించడంపై స్పందిస్తూ.. బ్లాక్ మార్కెటింగ్ ను అరికట్టడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

### అమెరికా దాడిపై భారత్ తీవ్ర ఆగ్రహం


ఒమన్ గల్ఫ్‌లో ఒక వాణిజ్య నౌకపై అమెరికా సైన్యం జరిపిన దాడిలో ముగ్గురు భారతీయ నౌకా సిబ్బంది మరణించిన ఘటనపై భారతదేశం తీవ్ర నిరసన వ్యక్తం చేసిందని మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. ఈ విషయమై భారత్‌లోని అమెరికా రాయబార ప్రతినిధిని రెండుసార్లు పిలిపించి మాట్లాడామని చెప్పారు. అలాగే కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ కూడా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో నేరుగా మాట్లాడి తమ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారని కేంద్ర మంత్రి వివరించారు.

### పెరగనున్న 'ఈ85' ఇంధన పంపులు

పర్యావరణ అనుకూల ఇంధన రంగం గురించి మాట్లాడుతూ.. ప్రస్తుతం జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలో 47 'ఈ85' (85 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్) ఇంధన పంపులు ఉన్నాయని మంత్రి తెలిపారు. రాబోయే డిసెంబర్ 2026 నాటికి వీటి సంఖ్యను 500కు, డిసెంబర్ 2027 నాటికి ఏకంగా 5,000 పంపులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటించారు.

# సముద్రంపై ఏఐ సామ్రాజ్యం! శామ్‌సంగ్ కొత్త ప్రయోగం

ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విస్తరిస్తున్న కొద్దీ డేటా సెంటర్ల అవసరం మరింతగా పెరుగుతోంది. అయితే భూమిపై స్థలం కొరత, భారీ విద్యుత్ అవసరాలు, శీతలీకరణ సమస్యలు టెక్ దిగ్గజాలకు సవాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణ కొరియాకు చెందిన శామ్‌సంగ్ హెవీ ఇండస్ట్రీస్ సముద్రంపై తేలియాడే ఏఐ డేటా సెంటర్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది.




### మూడు సంస్థలు కలిసి..

తేలియాడే డేటా సెంటర్ల అభివృద్ధి కోసం శామ్‌సంగ్ హెవీ ఇండస్ట్రీస్,గ్రీకు షిప్పింగ్ సంస్థ క్యాపిటల్ క్లీన్ ఎనర్జీ క్యారియర్స్,సముద్ర భద్రతా ప్రమాణాల సంస్థ లాయిడ్స్ రెజిస్టర్ కలిసి సంయుక్త అభివృద్ధి ఒప్పందం (JDP) కు దుర్చుకున్నాయి. ఇటీవల గ్రీస్‌లో జరిగిన ప్రముఖ అంతర్జాతీయ షిప్పింగ్ ఎగ్జిబిషన్ 'పోసిడోనియా 2026' సందర్భంగా ఈ ఒప్పందాన్ని ప్రకటించారు. ఇందు లో శామ్‌సంగ్ సాంకేతిక రూపకల్పన, నిర్మాణ బాధ్యతలు చేపట్టగా, క్యాపిటల్ పెట్టుబడులు, ప్రాజెక్టు అభివృద్ధిని పర్యవేక్షిస్తుంది. లాయిడ్స్ రిజిస్టర్ భద్రతా ధ్రువీకరణలు, నియంత్రణ అంశాలను చూసుకుంటుంది.

### డేటా సెంటర్లు సముద్రంపై ఎందుకు?

భారీ ఏఐ డేటా సెంటర్లకు విస్తారమైన స్థలం, అపారమైన విద్యుత్ సరఫరా, అధిక శీతలీకరణ వ్యవస్థలు అవసరం. అమెరికా, యూరప్ వంటి ప్రాంతాల్లో భూమి లభ్యత తగ్గిపోవడం, విద్యుత్ గ్రిడ్ కనెక్షన్ల ఆలస్యం కారణంగా కొత్త డేటా సెంటర్ల నిర్మాణం కష్టమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో సముద్రంలో లేదా నదులపై తేలియాడే డేటా సెంటర్లు ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నాయి. సముద్రపు నీటినే నేరుగా శీతలీకరణ కోసం వినియోగించడం వల్ల విద్యుత్ వినియోగం కూడా తగ్గే అవకాశం ఉంది.

### 50 మెగావాట్ల సామర్థ్యం.. వేలాది ఏఐ సర్వర్లు

శామ్‌సంగ్ అభివృద్ధి చేస్తున్న తొలి ఫ్లోటింగ్ డేటా సెంటర్ సామర్థ్యం 50 మెగావాట్లుగా ఉంటుంది. ఇది వేల సంఖ్యలో ఏఐ సర్వర్లను నడిపించే సామర్థ్యం కలిగి ఉంటుంది. ఈ కేంద్రం రెండు విధాలుగా విద్యుత్తును పొందగలదు. తీర ప్రాంతాలకు సమీపంలో ఉన్నప్పుడు సముద్ర అడుగు కేబుళ్ల ద్వారా విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానమవుతుంది. అవసరమైతే ద్రవీకృత సహజ వాయువు ఆధారిత సాలిడ్ ఆక్సైడ్ ఫ్యూయల్ సెల్స్ ద్వారా స్వయంగా విద్యుత్తు ఉత్పత్తి చేసుకునే సౌకర్యం కూడా ఉంటుంది.

### సర్వర్లకు సముద్రం సవాలే!

అయితే సముద్రంలో ఏఐ సర్వర్లను దీర్ఘకాలం నిర్వహించడం అంత సులభం కాదు. ఓడల కదలికలు, కంపనాలు, ఉప్పునీటి ప్రభావం, తేమ వంటి అంశాలు సున్నితమైన హార్డ్‌వేర్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ సవాళ్లను అధిగమించేందుకు శామ్‌సంగ్ హెవీ ఇండస్ట్రీస్, సూపర్‌మైక్రో సంస్థతో కలిసి పరిశోధనలు నిర్వహిస్తోంది. సముద్ర వాతావరణంలో సర్వర్ల పని తీరును పరీక్షించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.


### షిప్పింగ్ పరిశ్రమకు కొత్త వ్యాపార అవకాశాలు

ఫ్లోటింగ్ డేటా సెంటర్లు షిప్పింగ్ పరిశ్రమకు కూడా కొత్త ఆదాయ మార్గాలను తెరవవచ్చు. ఇప్పటివరకు సరుకు రవాణాపైనే ఆధారపడిన ఓడ యజమానులు, భవిష్యత్తులో టెక్ కంపెనీలు, క్లౌడ్ సేవల సంస్థలకు డేటా సెంటర్ సామర్థ్యాన్ని దీర్ఘకాలిక లీజుకు ఇవ్వడం ద్వారా స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉంది.

### మరిన్ని సముద్ర డేటా సెంటర్లు

ఈ రంగంలో శామ్‌సంగ్ ఒక్కటే కాదు. జపాన్‌కు చెందిన మిత్సుయి ఒ.ఎస్.కె. లైన్స్ (MOL), టర్కీకి చెందిన కర్పవర్‌షిప్ కలిసి 73 మెగావాట్ల తేలియాడే డేటా సెంటర్‌ను 2027 నాటికి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. చైనాలో షాంఘై సమీపంలో 24 మెగావాట్ల నీటి అడుగున డేటా సెంటర్ ఇప్పటికే పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించింది.

# మోటోరోలా సరికొత్త '5జీ' స్మార్ట్ ఫోన్లు!



**న్యూఢిల్లీ:** భారత్‌లో లీడింగ్ కృత్రిమ మేధ (ఏఐ) స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ 'మోటోరోలా' దేశీయ మార్కెట్లోకి సరికొత్త ఫీచర్లతో రెండు 5జీ స్మార్ట్‌ఫోన్లను ప్రవేశపెట్టింది. 'మోటో జీ37', 'మోటో జీ37 పవర్' పేర్లతో వస్తున్న మోడళ్లపై పరిమిత కాల ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తూ, భారీ డిస్కౌంట్లను అందుబాటులోకి తెచ్చింది. వినియోగదారుల బడ్జెట్‌కు తగినట్లుగా అత్యంత తక్కువ ధరకే ప్రీమియం తరహా ఫీచర్లు, అత్యుత్తమ బ్యాటరీ పర్ఫార్మెన్స్, మిలిటరీ గ్రేడ్ ల్యాబ్ సర్టిఫైడ్ రక్షణతో ఈ ఫోన్లను తీసుకొచ్చినట్లు కంపెనీ పేర్కొంది. ఈ స్మార్ట్‌ఫోన్లు ఆకర్షణీయమైన పాంటోన్ కలర్ ఆప్షన్లలో లభిస్తాయి.

### ఫీచర్లు ఇవే

మోటో జీ37, మోటో జీ37 పవర్.. ఈ రెండు ఫోన్లలోనూ 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్‌తో కూడిన భారీ 6.7 అంగుళాల డిస్‌ప్లేను అందించారు. సినిమాటిక్ ఆడియో అనుభూతిని అందించే వినూత్నమైన 'డాల్బీ అట్మోస్' స్టీరియో స్పీకర్లు ఉన్నాయి. ఫోటోగ్రఫీ కోసం గూగుల్ ఏఐ ఎడిటింగ్ టూల్స్ సపోర్ట్ చేసే '50ఎంపీ క్వాడ్ పిక్సెల్ ఏఐ కెమెరా'ను ఈ రెండు మోడళ్లలోనూ అమర్చారు. ముఖ్యంగా 'మోటో జీ37 పవర్' ఫోన్‌లో మూడు రోజుల పాటు నిరంతరాయంగా పనిచేసే భారీ 7000ఎంఏహెచ్ బ్యాటరీ, 33డబ్ల్యూ టర్బోపవర్ ఛార్జింగ్ సదుపాయం ఉన్నాయి. అలాగే ఇందులో శక్తివంతమైన మీడియాటెక్ డైమెన్సిటీ 6400 ప్రాసెసర్, 128జీబీ స్టోరేజ్, గరిష్ఠంగా 24జీబీ వరకు ర్యామ్ బూస్ట్ చేసుకునే ఆప్షన్ అందించారు. దీనికి రక్షణగా స్క్రీన్ పై గొరిల్లా గ్లాస్ 7ఐ, ఎంఐఎల్-ఎస్‌టీడీ-810 హెచ్ మిలిటరీ గ్రేడ్ సర్టిఫికేషన్, ఐపీ64 వాటర్-రెసిస్టెంట్ డిజైన్ ఉన్నాయి. స్మార్ట్ యూజర్ అనుభూతి కోసం గూగుల్ 'జెమిని', 'సర్కిల్ టు సెర్చ్' వంటి ఏఐ ఫీచర్లు ఇందులో ఇన్‌బిల్ట్‌గా వస్తాయి.

### ధరల విషయానికొస్తే..

మోటో జీ37 బేసిక్ మోడల్ ప్రత్యేక పరిమిత కాల ఆఫర్ ధర రూ.13,999గా ఉంది (దీని అసలు ధర రూ.14,999). ఇక 'మోటో జీ37 పవర్' మోడల్ 4జీబీ+128జీబీ వేరియంట్ ప్రారంభ ధర రూ.15,999 గా ఉండగా , దీని టాప్ వేరియంట్ (8జీబీ+128జీబీ) అసలు ధర రూ.21,999 కాగా.. రూ.2,000 బ్యాంక్ ఆఫర్‌తో రూ.19,999 కే లభిస్తుంది. వినియోగదారులు ఈ ఫోన్లను ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్, మోటోరోలా అధికారిక వెబ్‌సైట్ తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న రిటైల్ స్టోర్ల ద్వారా కొనుగోలు చేయవచ్చు.



# కాక్రోచ్ పార్టీ ధర్నాలో ప్రకాష్ రాజ్ సంచలన ఎంట్రీ




**బెంగళూరు:** నీట్‌యూజీ 2026 పరీక్షల అక్రమాలు, పేపర్ లీకేజీ వివాదం దేశవ్యాప్తంగా కార్చిచ్చులా రగులుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు న్యాయం జరగాలంటూ 'కాక్‌రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఆధ్వర్యంలో ఆదివారం బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్ వద్ద భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ ఆందోళనకు ప్రముఖ బహుభాషా నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాష్‌రాజ్ మద్దతు తెలపడమే కాకుండా స్వయంగా హాజరుకావడం సంచలనంగా మారింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి.

### 'ఎక్స్' వేదికగా ప్రకాష్ రాజ్ పిలుపు

గతంలో ఢిల్లీలో జరిగిన నిరసనకు కొన్ని కారణాల వల్ల రాలేకపోయిన నటుడు ప్రకాష్ రాజ్, ఈసారి బెంగళూరు ధర్నాలో పాల్గొంటున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ.. ప్రభుత్వం తన వైఫల్యాలకు బాధ్యత వహించేలా మనమంతా గొంతు ఎత్తాలని, ఈ శాంతియుత నిరసనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ విధానాలను నిరంతరం విమర్శించే ప్రకాష్ రాజ్ ఈ ఉద్యమంలో చేరడంతో జెన్ జెడ్ నేతృత్వంలోని ఈ విద్యార్థి ఉద్యమానికి మరింత బలం చేకూరినట్లయింది.

### దేశవ్యాప్తంగా ఎగిసిపడుతున్న నిరసన జ్వాలలు

గత వారం రోజులుగా కాక్రోచ్ జనతా పార్టీ దేశంలోని పలు నగరాల్లో వరుస ఆందోళనలతో హోరెత్తిస్తోంది. జూన్ 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ ప్రదర్శనతో ప్రారంభమైన ఈ ఉద్యమం.. ఆ తర్వాత పుణె, లక్నో, అమృత్‌సర్ నగరాలకు పాకింది. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో జరిగే నిరసనలో ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కూడా ప్రసంగించనున్నారు. దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థ కుప్పకూలిందని, కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం ఆటలాడుతోందని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### జూన్ 20న 'ఢిల్లీ చలో'..

ఈ పోరాటాన్ని ఇంతటితో ఆపబోమని, జూన్ 20న దేశ రాజధాని ఢిల్లీని ముట్టడించి, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంతవరకు అక్కడే తిష్ట వేస్తామని సీజేపీ ప్రతినిధి దిప్కే స్పష్టం చేశారు. పుణె నిరసనలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రధాని మోదీకి దేశంలోని ఒక కోటి మంది విద్యార్థుల భవిష్యత్తు ముఖ్యమా, లేక ఒక అసమర్థ మంత్రి ముఖ్యమా?' అంటూ ఘాటుగా ప్రశ్నించారు.

# ఖాన్ సార్ కేసులో ఊహించని మలుపు




**పట్నా:** బిహార్‌లోని పట్నా కోచింగ్ సెంటర్ల వివాదం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి చేరింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఖాన్ సార్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ గొడవలో నిందితుడిగా ఉంటూ, పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్న ప్రిన్స్ యాదవ్ నేపాల్‌లోని ఒక హోటల్‌లో అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోయాడు. జ్ఞాన్ బిందు కోచింగ్ సెంటర్ డైరెక్టర్ రోషన్ ఆనంద్ సోదరుడే ఈ ప్రిన్స్ యాదవ్. ఈ మరణం వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

### నేపాల్ హోటల్‌లో కలకలం

ప్రిన్స్ యాదవ్ మరణించిన సమయంలో అతడితో పాటు హోటల్ గదిలో ఉన్న కొంతమంది యువకులను నేపాల్ పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం వారిని రహస్య ప్రదేశంలో విచారిస్తున్నారు. ప్రిన్స్ యాదవ్ మరణానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, అన్ని కోణాల్లోనూ లోతుగా దర్యాప్తు జరుపుతున్నామని నేపాల్ అధికారులు వెల్లడించారు. అయితే, ఈ ఘటనపై అక్కడి ప్రభుత్వం ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

### పట్నా జైల్లో అన్న.. నేపాల్‌లో తమ్ముడు

జూన్ 2వ తేదీన పట్నాలోని ఫైసల్ ఖాన్ అలియాస్ ఖాన్ సార్‌కు చెందిన 'ఖాన్ గ్లోబల్ స్టడీస్' కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌పై దాడి, లూటీ కేసులో జ్ఞాన్ బిందు డైరెక్టర్ రోషన్ ఆనంద్‌ను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. ప్రస్తుతం అతను పట్నా జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ దాడి కేసుతో సంబంధం ఉన్నందుకే రోషన్ ఆనంద్ తమ్ముడైన ప్రిన్స్ యాదవ్ నేపాల్‌కు పారిపోయినట్లు తెలుస్తోంది. ఇంతలోనే అతను శవమై తేలడం పలు అనుమానాలకు తావిస్తోంది.

### జూన్ 20 వరకు ఖాన్ సార్‌కు ఊరట

ఈ సంచలన వివాదంలో ప్రముఖ యూట్యూబర్, కోచింగ్ సెంటర్ అధినేత ఖాన్ సార్‌ను కూడా పోలీసులు నిందితుడిగా చేర్చారు. అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి ఖాన్ సార్ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఖాన్ సార్ అరెస్ట్‌పై జూన్ 20 వరకు స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అటు అన్న జైల్లో ఉండటం, ఇటు తమ్ముడు అనుమానాస్పదంగా మరణించడంతో ఈ వివాదం మరింత ముదిరింది.

# మాట జారిన రాహుల్..
# ఇండియా కూటమిలో దుమారం



**తిరువనంతపురం:** ప్రతిపక్ష ఇండియా కూటమిలో అంతర్గత విభేదాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ.. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. రాహుల్ వ్యాఖ్యలపై విజయన్‌తో పాటు సీపీఎం అగ్రనేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇండియా కూటమిలో ఐక్యతపై మరోసారి ప్రశ్నలు తలెత్తాయి. ఇంతకీ రాహుల్ ఏమన్నారంటే.. ఇటీవల జరిగిన ఇండియా కూటమి సమావేశంలో మిత్రపక్షాల మధ్య సంబంధాలపై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా అన్ని పార్టీలు కలిసి పోరాడుతున్నప్పటికీ, కొన్ని రాష్ట్రాల్లో మాత్రం రాజకీయ ప్రత్యర్థులుగా పోటీ పడుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా కేరళ రాజకీయాలను ప్రస్తావిస్తూ..'కేరళలో మేము సీపీఎంతో రాజకీయంగా పోరాడుతున్నాం. అక్కడ పినరాయి విజయన్ మా ప్రధాన ప్రత్యర్థి. అందుకే నేను వెళ్లి ఆయనను హగ్ చేసుకోలేను, చేయను కూడా' అని కామెంట్స్. ఈ వ్యాఖ్యలు బయటకు రావడంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

### పినరాయి ఘాటు స్పందన..

రాహుల్ వ్యాఖ్యలపై స్పందించిన పినరాయి విజయన్.. తనకు హగ్ చేయడం లేదా చేయకపోవడం అసలు సమస్య కాదన్నారు. అయితే ఆ వ్యాఖ్యల వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశమే ఆందోళన కలిగిస్తోందని విమర్శించారు.'నన్ను హగ్ చేయాల్సిన అవసరం లేదు. కానీ రాహుల్ గాంధీ గతంలో పార్లమెంట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని హగ్ చేసిన విషయం దేశం మొత్తం చూసింది. ఇప్పుడు నన్ను హగ్ చేయలేనని చెప్పడం ద్వారా ఏ సందేశం ఇవ్వాలనుకుంటున్నారు?' అని ప్రశ్నించారు. అంతేకాకుండా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని చెప్పే కాంగ్రెస్ నాయకత్వం, అదే సమయంలో మిత్రపక్షాలపై దాడి చేయడం సరైన రాజకీయ విధానం కాదని విమర్శించారు.

### సీపీఎం నుంచి తీవ్ర ప్రతిస్పందన..

రాహుల్ వ్యాఖ్యలపై సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేజీ కూడా తీవ్రంగా స్పందించారు. 'పినరాయి విజయన్‌ను హగ్ చేయమని ఎవరూ రాహుల్ గాంధీని అడగలేదు. కానీ కేంద్ర దర్యాప్తు సంస్థలు చేస్తున్న ఆరోపణలను బలపరిచేలా మాట్లాడటం మాత్రం మానుకోవాలి' అని వ్యాఖ్యానించారు. కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దాడులు బీజేపీకి రాజకీయంగా లాభం చేకూర్చేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష ఐక్యతను బలోపేతం చేయాల్సిన సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు అనవసర వివాదాలకు దారితీస్తాయని అన్నారు.

### కేరళలో కాంగ్రెస్-సీపీఎం ప్రత్యర్థులే

ఇండియా కూటమిలో కాంగ్రెస్, సీపీఎం జాతీయ స్థాయిలో మిత్రపక్షాలుగా ఉన్నప్పటికీ, కేరళలో మాత్రం రెండు పార్టీలు దశాబ్దాలుగా ప్రధాన రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్నాయి. కేరళలో ఎల్‌డీఎఫ్‌కు సీపీఎం నాయకత్వం వహిస్తుండగా, యూడీఎఫ్‌కు కాంగ్రెస్ నేతృత్వం వహిస్తోంది. ప్రతి ఎన్నికలోనూ ఈ రెండు కూటముల మధ్యే ప్రధాన పోటీ జరుగుతుంది. అందువల్ల జాతీయ స్థాయిలో కలిసి పనిచేస్తున్నప్పటికీ, రాష్ట్ర రాజకీయాల్లో పరస్పరం విమర్శించుకోవడం కొనసాగుతోంది.

### కూటమికి కొత్త తలనొప్పి..


ఇప్పటికే ఇండియా కూటమిలోని పలు మిత్రపక్షాల మధ్య విభేదాలు బహిర్గతమవుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్-తృణమూల్ కాంగ్రెస్ మధ్య, పంజాబ్‌లో కాంగ్రెస్-ఆప్ మధ్య, కేరళలో కాంగ్రెస్-సీపీఎం మధ్య రాజకీయ పోటీ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు కూటమి ఐక్యతపై కొత్త సందేహాలకు తావిచ్చాయి. 2029 లోక్‌సభ ఎన్నికల దిశగా ప్రతిపక్ష ఐక్యతను బలోపేతం చేయాల్సిన సమయంలో మిత్రపక్షాల మధ్య బహిరంగ విమర్శలు కూటమికి ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగే, ఇండియా కూటమి నాయకుల మధ్య పరస్పర విమర్శలు అధికార బీజేపీకి రాజకీయ అస్త్రంగా మారే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రతిపక్షాలు వేదికలపై ఐక్యంగా ఉన్నామని చెబుతూనే, మరోవైపు పరస్పరం విమర్శించుకోవడం ప్రజల్లో గందరగోళానికి దారితీస్తుందని అభిప్రాయపడుతున్నారు. కాగా రాహుల్ వ్యాఖ్యలతో మొదలైన ఈ వివాదం కాంగ్రెస్-సీపీఎం మధ్య మాటల యుద్ధానికి దారితీయగా, ఇండియా కూటమి భవిష్యత్తుపై కూడా కొత్త చర్చకు తెరలేపింది.



# నేపాలీ గ్యాంగ్స్‌పై ఆర్జీవీ కన్ను?

హైదరాబాద్‌తో పాటు కొన్ని ఇతర ప్రాంతాల్లో ఇటీవల కాలంలో నేపాలీ గ్యాంగ్స్ సృష్టించిన హత్యలు, దోపిడీలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ఓ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్యను హత్య చేసిన ఘటనతో ఈ నేపాలీ ముఠాల ఆగడాలు మరింతగా వెలుగులోకి వచ్చాయి. దాంతో ఈ పరిణామాలపై దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ దృష్టి పడింది. ఎప్పుడూ రియల్ లైఫ్ కథలను తనదైన శైలిలో సినిమాగా మలచడంలో ఆసక్తి చూపుతుంటాడు వర్మ. తాజాగా ఈ దర్శకుడు నేపాలీ ముఠాల కథను తెరపైకి తీసుకురావాలని ఆలోచిస్తున్నాడని సమాచారం. దీనికి సంబంధించి సరైన పాయింట్ కోసం ఆయన వెతుకుతున్నాడని తెలుస్తోంది. గతేడాది తన సూపర్ హిట్ చిత్రం 'సత్య' సినిమాను మళ్లీ చూశాడు వర్మ. అనంతరం ఎందుకు దానిని బెంచ్‌మార్క్‌గా పెట్టుకోలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇకపై తన ప్రతిభకు తగ్గ గొప్ప సినిమాలు తీస్తానని ప్రతిజ్ఞ కూడా చేశాడు. అయితే ఆ తర్వాత తాను ప్రకటించిన 'సిండికేట్' సహా పలు ఇతర ప్రాజెక్టులు సైతం కార్యరూపం దాల్చలేదు.

# 'రైల్లో న్యూస్ పేపర్ పరచుకుని పడుకున్నా'



బాలీవుడ్ నటుడు సోనూసూద్ భారతీయ రైల్వేపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. వందేభారత్ రైల్లో ప్రయాణించిన ఆయన ఇండియన్ రైల్వేస్ అభివృద్ధిని ప్రశంసించారు. ఇంత నాణ్యమైన ప్రయాణాన్ని అందిస్తున్నందుకు భారతీయ రైల్వేకు ధన్యవాదాలు తెలిపారు. నాణ్యమైన ఆహారం అద్భుతమైన సిబ్బంది సేవలు ఉన్నాయని కొనియాడారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గతంలో తాను టికెట్ బుక్ చేసుకోవడానికే ఇబ్బందులు పడేవాడినని సోనూ సూద్ వెల్లడించారు. నాగ్‌పూర్ నుంచి ముంబయి వెళ్లేటప్పుడు ఈ పరిస్థితి ఎదురైందని తెలిపారు. తాను న్యూస్ పేపర్ కింద పరచుకుని రైళ్లలో ప్రయాణించిన రోజులు కూడా ఉన్నాయని సోనూసూద్ అన్నారు. భారతీయుల ప్రయాణంలో క్వాలిటీ చూసి గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా రైల్వేశాఖను ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సోనూసూద్ మాటలతో రైల్వే ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# నన్ను గే అని పిలిచారు..

## మౌనీ రాయ్ ఆవేదన

బాలీవుడ్ భామ మౌనీ రాయ్ బాలీవుడ్‌లో సుపరిచమైన పేరు. ఇటీవలే ఆమె తన భర్త సూరజ్ నంబియార్‌తో విడిపోతున్నట్లు ప్రకటించింది. తామిద్దరం పరస్పర అంగీకారంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించింది. కానీ ఆ తర్వాత మౌనీ రాయ్‌పై పెద్దఎత్తున ట్రోల్స్, విమర్శలు వచ్చాయి. చాలా దారుణంగా కొందరు కామెంట్స్ చేశారు. ఆమెను గే అంటూ రూమర్స్ సృష్టించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన మౌనీ రాయ్ తనపై వచ్చిన రూమర్స్, ట్రోల్స్‌పై స్పందించింది. ఓ యూట్యూబ్ ఛానెల్‌తో మాట్లాడిన ఆమె.. తనపై గే అన్న రూమర్‌పై రియాక్ట్ అయింది. తాను విన్నవాటిలో అత్యంత అసంబద్ధమైన రూమర్ ఇదేనని మౌనీ రాయ్ వెల్లడించింది.

విడాకుల ప్రకటన తర్వాత తన చుట్టూ బలమైన మద్దతుగా నిలబడేవాళ్లు ఉండడం తన అదృష్టమని మౌనీ రాయ్ చెప్పింది. నాకు ఎల్లప్పుడూ ఒక కొండంత అండగా నిలిచే స్నేహితులు, కుటుంబం ఉండటం నా అదృష్టంగా భావిస్తున్నానని తెలిపింది. కష్ట సమయాల్లో నాకు సహాయం చేయడంలో నా స్నేహితులు ముఖ్యమైన పాత్ర పోషించారని మౌని చెప్పుకొచ్చింది. నా ఫ్రెండ్స్ మంచి, చెడు సందర్భాల్లోనూ నాకు తోడుగా నిలిచారని మౌనీ రాయ్ పంచుకున్నారు. కాగా.. నాలుగేళ్ల డేటింగ్ తర్వాత 2022లో సూరజ్‌ను వివాహం చేసుకున్నారు. ఇటీవలే 2026లో అతనితో విడిపోయారు. మౌని, సూరజ్ ఇద్దరూ ఈ విషయాన్ని ప్రకటించారు. ఇక సినిమాల విషయానికొస్తే 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' (2026) చిత్రంలో కనిపించారు.



రాశి సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.. టాలీవుడ్‌కి ఇటీవల ఎంట్రీ ఇచ్చిన కొత్త హీరోయిన్లలో ఈ ముద్దుగుమ్మ ఒకరు. రాశి సింగ్ మొట్టమొదట "జెమ్" సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. అయితే ఈ ముద్దుగుమ్మ చిన్నప్పటి నుండి సీరియల్స్ చూసి యాక్టర్ కావాలని ఆసక్తి కలిగిందట. ఒక ఇంటర్వ్యూ లో రాశీ సింగ్ తన కాలేజ్ డేస్ నాటి లవ్ స్టోరీ గురించి చెప్పుకొచ్చింది. ఏకంగా లెక్చరర్‌తోనే ప్రేమయాణం నడిపినట్లు చెప్పి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. 'స్కూల్ డేస్ అయి పోయాక కాలేజీలో చేరాను. ఆ సమయంలో నాకో బాయ్ ఫ్రెండ్ ఉన్నాడు. అతను మాకు లెక్చరర్ కూడా. కాలేజీలో నాకు ఎంతో ఫేవర్ గా ఉండేవాడు. పరీక్షలు ఉన్నప్పుడు నాకు ముందే ఎగ్జామ్ పేపర్లు కూడా ఇచ్చేవాడు. వైవా జరిగే సమయంలో నన్ను ఎలాంటి ప్రశ్నలు అడిగేవాడు కాదు. ఇద్దరం సరదాగా కూర్చొని కబుర్లు చెప్ప కుంటూ టైమ్ పాస్ చేసేవాళ్లం. ఆ సమయంలో నా వయసు 17 ఏళ్లు.. అతను కూడా చాలా యంగ్.. పెళ్లి కూడా కాలేదు. అయినప్పటికీ మా మధ్య ఏమీ జరగలేదు. కొన్నేళ్ల క్రితం ఆయన పెళ్లి చేసుకున్నారు. కుంటూ టైమ్ పాస్ చేసేవాళ్లం. ఇప్పటికీ ఆయన నాతో టచ్ లో ఉన్నారు. నన్ను ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా ఫాలో అవుతున్నాడు. అతని వైఫ్ కూడా ఫాలో అవుతుంది' అని రాశీ సింగ్ చెప్పుకొచ్చింది. కుంటూ టైమ్ పాస్ చేసేవాళ్లం.

## 17 ఏళ్లకే అతడితో ప్రేమలో పడ్డా..





# పేరు మార్చుకున్న రష్మిక..

# కొత్త పేరు ఇదే!

రష్మిక మందన్న పేరు మార్చుకున్నారు. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న విజయ్ దేవరకొండ, రష్మిక.. ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. పెళ్లి తర్వాత రష్మిక పేరు చివరన దేవరకొండ లేదా విజయ్ అని యాడ్ చేస్తారని చాలా మంది భావించారు. గతంలో చాలా మంది హీరోయిన్లు పెళ్లి చేసుకోగానే భర్త ఇంటిపేరు లేదా భర్త పేరుని తమ పేరుకు జోడించేవారు. కానీ రష్మిక అలా చేయలేదు. తన సోషల్ మీడియా ఖాతాలన్నీ పెళ్లికి ముందు ఉన్న పేరుతోనే ఉన్నాయి. దీంతో ఆమె పేరులో ఎలాంటి మార్పు ఉండదని అనుకున్నారు. అయితే తాజాగా రష్మిక కూడా తన పేరు చివరన భర్త ఇంటిపేరుని యాడ్ చేశారు. తాజాగా ఆమె భర్త విజయ్ దేవరకొండతో కలిసి అత్తాగారి సొంతూరు నాగర్‌కర్నూల్ జిల్లా తుమ్మన్‌పేటలో వెళ్లారు. అక్కడ 'ది దేవరకొండ ఫౌండేషన్' ఆధ్వర్యంలో 2026 విద్యా సంవత్సరంలో 9, 10వ తరగతుల్లో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి ఉపకారవేతనాలు అందజేశారు.

ఈ సందర్భంగా రష్మిక తనని తాను రష్మిక మందన్న దేవరకొండగా పరిచయం చేసుకున్నారు. 'ఈ రోజు రష్మిక మందన్న దేవరకొండలా మీ ముందు మాట్లాడుతున్నా. చాలా ఆనందంగా ఉంది. 9,10వ తరగతిలో ఫస్ట్, సెండర్ ర్యాంకులు సాధించి మీరు(విద్యార్థులను ఉద్దేశించి) నా కంటే ముందే ఉన్నారు. చాలా కష్టపడి ఈ ర్యాంకులు సాధించారు. లైఫ్‌లో కొన్నిసార్లు విన్ అవుతాం, కొన్నిసార్లు ఫెయిల్ అవుతాం.. కానీ ప్రతిసారి నేర్చుకుంటాం. పేరెంట్స్, టీచర్స్ నుంచి నేర్చుకొని గొప్పగా ఎదగండి.' అని విద్యార్థులకు సూచించారు. అయితే రష్మిక తొలిసారి తనపేరుని రష్మిక మందన్న దేవరకొండ అని పరిచయం చేసుకోవడం విశేషం. సోషల్ మీడియా ఖాతాల్లో కూడా పేరు మార్చుకుంటారా లేదా అలానే ఉంచుతారా? చూడాలి.

OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com